# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం | జాతీయ పత్రిక

యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 09 | గురువారం | 6-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/-

Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:09 | Thursday | 6-8-2026 | Pages:08 | Cost:2/-









## దిగొచ్చిన మెటా..

- భారత ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పిన మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్
- డీప్‌ఫేక్‌లు, అభ్యంతరకర కంటెంట్ వ్యాప్తిపై చింతిస్తున్నట్లు వెల్లడి
- ప్రధాని మోదీ పోస్ట్ తొలగింపు వ్యవహారంలో కీలక పరిణామం
- తప్పులు జరిగాయని అంగీకారం, సేఫ్ హార్బర్ రక్షణపై కేంద్రం హెచ్చరిక
- ఢిల్లీలో ఐటీ కార్యదర్శితో మెటా ప్రతినిధుల ఉన్నత స్థాయి సమావేశం

2లో

## నిరసనల్లో పాల్గొనే యువత పట్ల సహనంతో వ్యవహరించాలి

- హింసను అదుపు చేసే క్రమంలో బలగాలు జాగ్రత్తగా ఉండాలన్న సుప్రీంకోర్టు
- యువత ఎదురుదాడికి దిగితే పరిస్థితులు మరింత దారి తప్పే ప్రమాదముందని హెచ్చరిక
- యువత హింసాత్మక మార్గాల వైపు వెళ్లకుండా చూడటమే అధికారుల ప్రాథమిక విధి అని వ్యాఖ్య



2లో

## విదేశాలకు వెళ్లండి, కానీ తిరిగి రండి

- అమరావతిలో అమృత విశ్వ విద్యాపీఠం స్నాతకోత్సవం
- ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు
- విద్య, వైద్యం, రాజకీయం వంటివి మిషన్లు, కమిషన్లు ఆశించేవి కావని ఉద్ఘాటన
- విదేశాలకు వెళ్లండి, నేర్చుకోండి, తిరిగి వచ్చి దేశానికి సేవ చేయాలని పిలుపు
- కృత్రిమ మేధస్సు కన్నా మానవ మేధస్సు, నిజమైన తెలివితేటలు ముఖ్యమని వెల్లడి

2లో



## రష్యా దాడుల్లో కీవ్ కకావికలం

- రాత్రంతా రష్యా క్షిపణులు, డ్రోన్ల దాడి
- 21 మంది దుర్మరణం
- నిలువరించే ఆయుధాలు నిండుకోవడంతో నష్టం: జెలెన్‌స్కీ

కీవ్: గగనతల రక్షణ వ్యవస్థలు బలహీనంగా ఉన్న సమయంలో శత్రుదేశం నుంచి క్షిపణులు విరుచుకుపడితే విధ్వంసం ఏస్థాయిలో ఉంటుందో ఉక్రెయిన్‌కు రష్యా రుచిచూపించింది. మంగళవారం రాత్రి నుంచి పెద్ద సంఖ్యలో బాలిస్టిక్ మిస్సైళ్లు, యాంటీ--షిప్ మిస్సైళ్లు, డ్రోన్లతో ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా సమీప ప్రాంతాలపై రష్యా విరుచుకుపడింది. ఈ దాడుల్లో 21 మంది ప్రాణాలు కోల్పోయారు. జనావాసాలు, రైల్వేస్టేషన్, ఇ--కామర్స్ సంస్థ, రిటైల్ సంస్థల గిడ్డంగులపై దాడులు జరగడంతో అందులోని కొందరు సిబ్బంది సైతం చనిపోయారు. శిథిలాల కింద మరింత మంది చిక్కుకున్నారని, మరణాల సంఖ్య పెరిగే ఆస్కారముందని

- మిగతా 2వ పేజీలో

# బెదిరింపులకు భయపడేది లేదు..

### రాహుల్ గాంధీని కలిసిన విద్యార్థి నిరసనకారులు

- నిరసన చేస్తున్న విద్యార్థులు రాజ్యాంగ సంరక్షకులని రాహుల్ గాంధీ అభివర్ణన
- వారు ఎవరికీ క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని స్పష్టీకరణ
- ప్రధానిపై వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో విద్యార్థులకు రాహుల్ మద్దతు
- ఇళ్ల వద్దకు గూండాలను పంపి క్షమాపణ చెప్పాలని బెదిరిస్తున్నారని ఆరోపణ
- పోలీసుల తీరు, వేధింపులపై రాహుల్ సమక్షంలో విద్యార్థుల ఆవేదన



ఇటీవల సీజేపీ ఆధ్వర్యంలో నిరసనలతో వార్తల్లో నిలిచిన విద్యార్థులకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అండగా నిలిచారు. వారు "రాజ్యాంగ సంరక్షకులు" అని అభివర్ణించిన రాహుల్, తమ హక్కుల కోసం పోరాడుతున్న వారు ఎవరికీ క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన విద్యార్థులు, ముంబైలో పోలీస్ వ్యాన్‌ను అడ్డుకుని వైరల్ అయిన యువతితో కలిసి బుధవారం ఆయన తన నివాసం (10 జన్‌పథ్) వెలుపల మీడియా సమావేశం నిర్వహించారు.

- మిగతా 2వ పేజీలో


# 152 మీటర్ల ఎత్తుకు ఒప్పించండి

- తుమ్మిడిహెట్టిపై కేంద్రమంత్రి పాటిల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- తెలంగాణ, మహారాష్ట్ర మధ్య భేటీ ఏర్పాటు చేయండి
- సానుకూలంగా స్పందించిన పాటిల్
- కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్‌తోనూ సీఎం భేటీ



న్యూఢిల్లీ: ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణం ఎత్తు పెంచడానికి అనుమతించేలా మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బరాజ్ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదని పేర్కొన్నారు. కాబట్టి కనీసం 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కోరారు. ఢిల్లీ పర్యటనకు వచ్చిన సీఎం.. బుధవారం ఉదయం కేంద్రమంత్రిని ఆయన కార్యాలయంలో కలిశారు.

- మిగతా 2వ పేజీలో



## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి 2 రోజుల పోలీస్ కస్టడీ

- రెండు రోజుల కస్టడీకి అనుమతించిన రంగారెడ్డి జిల్లా కోర్టు
- సహచర శిక్షణ అధికారిణి ఫిర్యాదుతో కేసు నమోదు
- ప్రైవేట్ చాట్స్ బయటపెడతానని బెదిరించినట్లు ఆరోపణలు
- ఆంధ్రప్రదేశ్‌లో గతంలో కానిస్టేబుల్‌గా పనిచేసిన ఉదయ్ కృష్ణారెడ్డి



## వైఫల్యాలకు భయపడొద్దు..

- కఠిన మార్గాన్నే ఎంచుకోండి: అమృత వర్సిటీ స్నాతకోత్సవంలో నారా లోకేశ్
- అమరావతిలోని అమృత యూనివర్సిటీ స్నాతకోత్సవం
- గౌరవ అతిథిగా మంత్రి నారా లోకేశ్... విద్యార్థులకు దిశానిర్దేశం
- భవిష్యత్ అవకాశాల కోసం ఏపీ విద్యారంగంలో సమూల మార్పులు
- యువత ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని మంత్రి లోకేష్ ఆకాంక్ష
- వైఫల్యాలకు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి
- యువత కలల సాకారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ

ప్రపంచం గతంలో ఎన్నడూ లేనంత వేగంగా మారుతోందని, కృత్రిమ మేధస్సు (ఏఐ), క్వాంటం ఇంజనీరింగ్ వంటి నూతన సాంకేతికతలు సరికొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

### మ్మక్క–సారక్క ప్రాజెక్టుపై చంద్రబాబుతో

## రేవంత్ కుమ్మక్కయ్యారా?

- సమ్మక్కసాగర్ నీళ్లను ఏపీకి ధారాదత్తం చేసేందుకు రేవంత్ సర్కార్ సిద్ధపడిందన్న హరీశ్
- దీనిపై రేవంత్ నోరు విప్పాలని డిమాండ్



2లో

## మళ్లీ మీరొస్తేనే మా బతుకులు మారేది

- చంద్రబాబు ప్రభుత్వంలో కూడు దొరకడం లేదు
- మీ పాలనలో కడుపు నిండుగా అన్నం తిన్నాం
- చంద్రబాబు ప్రభుత్వంలో మోసపోయాం
- పొగాకు వేలం కేంద్రంలో వైఎస్ జగన్‌తో గోడు వెళ్లబోసుకున్న రైతులు



2లో

# వైఫల్యాలకు భయపడొద్దు..

(మొదటి పేజీ తరువాయి)

ఈ భవిష్యత్ అవకాశాలను యువత అందిపుచ్చుకునేలా సిద్ధం చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌లో విద్యా విధానాన్ని సమూలంగా మారుస్తున్నామని స్పష్టం చేశారు. అమరావతిలోని అమృత యూనివర్సిటీ స్నాతకోత్సవానికి భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరుకాగా, మంత్రి లోకేశ్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "యువత కేవలం ఉద్యోగార్థులుగా మిగిలిపోకూడదు, ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలన్నదే మా లక్ష్యం. వారు పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, పరిశోధకులు, నాయకులుగా ఎదగాలి. ఇందుకోసం విశ్వవిద్యాలయాలను, పరిశ్రమలను మరింత దగ్గర చేస్తున్నాం. ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ, యువత నేర్చుకోవడానికి, నూతన ఆవిష్కరణలు చేయడానికి, నాయకత్వం వహించడానికి అవకాశాలు కల్పిస్తున్నాం" అని వివరించారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే అత్యంత ఉత్సాహభరితమైన కాలంలో విద్యార్థులు తమ వృత్తి జీవితాన్ని ప్రారంభిస్తున్నారని, గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో ఒక గొప్ప ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. పట్టా పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతూ, "ఈరోజు మీ ప్రయాణానికి ముగింపు కాదు, ఒక కొత్త ప్రయాణానికి ఆరంభం కావాలి. వైఫల్యాన్ని చూసి ఎప్పుడూ భయపడకండి. వైఫల్యం అంటే మీరు సమర్థులు కాదని కాదు, ప్రయత్నించే ధైర్యం మీకుందని అర్థం. విజయం ఎప్పటికీ ప్రయత్నం విరమించని వారినే వరిస్తుంది. ప్రపంచంలో మార్పు తేగలమనే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి" అని పిలుపునిచ్చారు. ఈ డిగ్రీ కేవలం విద్యార్థులది మాత్రమే కాదని, వారి తల్లిదండ్రుల త్యాగాలు, కుటుంబ సభ్యుల మద్దతు, గురువుల మార్గనిర్దేశం కూడా ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు.

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి 2 రోజుల పోలీస్ కస్టడీ

(మొదటి పేజీ తరువాయి)

తనతోపాటు శిక్షణ పొందుతున్న మహిళా అధికారిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఎం. ఉదయ్ కృష్ణారెడ్డిని రెండు రోజుల పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో మరింత లోతుగా విచారించాల్సిన అవసరం ఉందన్న పోలీసుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసిన ఉదయ్ కృష్ణారెడ్డి 2025 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో తనతో పాటు శిక్షణ పొందుతున్న ఓ మహిళా అధికారిని వేధించినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. బాధితురాలు జులై 18న అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో, పోలీసులు భారతీయ న్యాయ సంహిత లోని లైంగిక వేధింపులు, క్రిమినల్ బెదిరింపులతో పాటు ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. జులై 28న ఉదయ్ కృష్ణారెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు, 29న 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి ఆయన చంచల్‌గూడ జైలులో ఉన్నాడు. బాధితురాలు మరొకరిని వివాహం చేసుకోవడంతో, వారి ప్రైవేట్ సంభాషణలను (చాట్స్) బయటపెడతానని ఉదయ్ కృష్ణారెడ్డి బెదిరించినట్లు పోలీసులు వెల్లడించారు. వీరిద్దరికీ 2023లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. శిక్షణ సమయంలోనూ తరచూ గొడవలకు దిగడం, ఆధిపత్య ధోరణి ప్రదర్శించడం, ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడం, ఆయుధాలు చూపి భయపెట్టడం వంటి చర్యలతో ఆమెను వేధించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

## సమ్మక్క –సారక్క ప్రాజెక్టుపై చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కయ్యారా?

తెలంగాణ ప్రజల నోటికాడి ముద్దను లాక్కునేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మండిపాటు కర్ణాటకలో జరిగిన ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ అనంతరం సమ్మక్క-సారక్క (సమ్మక్క సాగర్) ప్రాజెక్టుకు చెందిన తెలంగాణ వాటా నీళ్లను ఆంధ్రప్రదేశ్‌కు దారాదత్తం చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధపడిందంటూ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన... తెలంగాణ ప్రజలకు సంబంధించిన అత్యంత కీలకమైన నీటి హక్కులపై కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం వహించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటకలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంల సమావేశం, తుంగభద్ర గేట్ల ప్రారంభోత్సవం తర్వాత సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి మన రాష్ట్రానికి చెందిన 47 టీఎంసీల వాటాను ఏపీ కోసం వదులుకోవడానికి సిద్ధపడ్డారనే వార్తలు నెట్టింట వ్యాపిస్తున్నాయని... దీనిపై సీఎం రేవంత్ రెడ్డి నోరు విప్పాలని డిమాండ్ చేశారు. గోదావరి నదీ యాజమాన్య బోర్డు అజెండాలో సమ్మక్క సాగర్‌కు 47 టీఎంసీలు కేటాయించే ప్రసక్తే లేదని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసినా, ఈ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కనీసం స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని మండిపడ్డారు.

## విదేశాలకు వెళ్లండి, కానీ తిరిగి రండి

విద్య, వైద్యం, రాజకీయం వంటి రంగాలను ఒక పవిత్రమైన యజ్ఞంలా (మిషన్) భావించాలని, వాటి ద్వారా లబ్ధి పొందేందుకు (కమిషన్) ప్రయత్నించరాదని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు యువతకు పిలుపునిచ్చారు. అమరావతిలోని అమృత విశ్వ విద్యాపీఠం స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రసంగం తనను ఎంతగానో ఆకట్టుకుందని, అందుకే తాను సిద్ధం చేసుకున్న ప్రసంగ పత్రాన్ని పక్కనపెట్టి మనసులోని మాటలను పంచుకుంటున్నానని తెలిపారు. దేశం పట్ల అభిరుచి (జుఖంంఱశీఅ) పెంచుకుని, అంకితభావంతో పనిచేయాలని ఆయన విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే యువతకు వెంకయ్యనాయుడు తనదైన శైలిలో మూడు సూత్రాల సలహా ఇచ్చారు. "విదేశాలకు వెళ్లండి, అక్కడ ఆధునిక విజ్ఞానాన్ని నేర్చుకోండి, కానీ తప్పకుండా మాతృభూమికి తిరిగి రండి" అని ఆయన స్పష్టం చేశారు. ఇక్కడికి వచ్చాక తల్లిదండ్రులను, తాతయ్య-నానమ్మ/అమ్మమ్మలను బాగా చూసుకోవాలని, వారితో సమయం గడపాలని సూచించారు. దేశ ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం ద్వారానే జన్మభూమి రుణం తీర్చుకోగలమని ఆయన ఉద్బోధించారు.

# 152 మీటర్ల ఎత్తుకు ఒప్పించండి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యత, ఈ ప్రాజెక్టుకు అనుమతుల మంజూరు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానికి పీఎంఓ స్పందించి జలవనరుల శాఖకు లేఖ పంపడం తదితర విషయాల గురించి పాటిల్‌కు ముఖ్యమంత్రి వివరించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణానికి గతంలోనే ఉభయ రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే 152 మీటర్ల వరకు ఎత్తుతో బరాజ్ నిర్మించే అంశంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం చేసిందని, ఆ అధ్యయనం ప్రకారం152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మించినా ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైందని చెప్పారు. ఆ ముంపులోనూ 50 శాతం నదీ గర్భంలోనే ఉంటుందని వివరించారు. ఒకవేళ 148 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే గ్రావిటీ ద్వారా కావల్సినంత నీరు సరఫరా చేయలేమని అన్నారు. ఈ అంశంపై సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పీఎంఓ నుంచి లేఖ అందిందని ముఖ్యమంత్రికి పాటిల్ చెప్పారు. దీనిపై తొలుత కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి, రాష్ట్రస్థాయి అధికారులతో చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్య కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

**ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వండి**

పాలమూరు--రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ప్రాజెక్టులకు సత్వరమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను ముఖ్యమంత్రి కోరారు. బుధవారం పార్లమెంట్ భవన్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు కేంద్రమంత్రిని కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పాలమూరు ప్రాజెక్టుపై రూ.36,437 కోట్లు, డిండి ఎత్తిపోతలపై రూ.3,187 కోట్లు, సీతమ్మ సాగర్‌పై రూ.1,835 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుపై రూ.1,350 కోట్ల నిధులను వ్యయం చేసిందని చెప్పారు. అనుమతులు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయి, ప్రాజెక్టుల వ్యయం పెరుగుతోందని వివరించారు. ప్రదానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన దివంగత మాతృమూర్తి హీరాబెన్ మోదీలను సోషల్ మీడియా వేదికగా దూషించిన ఘటనలపై బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కనీసం ఒక్క కేసైనా నమోదు చేశారా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో తమ ప్రభుత్వం పూర్తిగా చట్ట ప్రకారమే ముందుకు వెళ్తోందన్నారు. సోషల్ మీడియాలో ప్రధానిని, ఆయన తల్లిని దూషిస్తున్నారంటూ హైదరాబాద్‌కు చెందిన బీజేపీ కార్యకర్త చేసిన ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. కాగా కేసు నమోదు చేసిన సైబరాబాద్ పోలీసు అధికారిని బదిలీ చేశారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో భేటీ తర్వాత సీఎం మీడియాతో పిచ్చాపాటీగా మాట్లాడారు.

**పనీపాటా లేనోళ్లు విమర్శలు చేస్తున్నారు..**

వచ్చిన ఫిర్యాదు ఆధారంగానే పోలీసులు కేసు నమోదు చేశారని రేవంత్ చెప్పారు. 'ప్రధానిపై, ఆయన తల్లిపై అభ్యంతకరమైన వ్యాఖ్యలు చేసిన కేసుకు సంబంధించి డీఎస్పీ బదిలీ వ్యవహారంపై ఢిల్లీలో పనీపాటా లేని కొందరు విమర్శలు చేస్తున్నారు..'అని పరోక్షంగా కిషన్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అధికారుల బదిలీ అనేది ముఖ్యమంత్రికి రాజ్యాంగం కల్పించిన విచక్షణాధికారమని, తన బాధ్యతల్లో అది కూడా ఒకటని పేర్కొన్నారు. బీజేపీ నేతలే వేరేవాళ్లను దారుణంగా తిడుతున్నారని, కాంగ్రెస్ నేతలను, ప్రతిపక్ష పార?టల నాయకులను, విద్యార్థులను అభ్యంతరకరమైన పదాలతో దూషిస్తున్నారని మండిపడ్డారు.

## రష్యా దాడుల్లో కీవ్ కకావికలం

(మొదటి పేజీ తరువాయి)

ఉక్రెయిన్ ప్రభుత్వం వెల్లడించింది. దాడుల్లో 44 మంది గాయాలపాలయ్యారని కీవ్ రీజియన్ సైనిక విభాగ సారథి తైమూర్ టకచెంకో తెలిపారు. ఈ దాడుల పాపం పరోక్షంగా యూరప్ మిత్రదేశాలదేనని ఉక్రెయిన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. సమయానికి ఇంటర్‌సెప్టార్ మిస్సైళ్ల వంటి గగనతల రక్షణ వ్యవస్థలను అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ స్థాయిలో ప్రాణనష్టం జరిగిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అసహనం వ్యక్తంచేశారు. శత్రుదేశ క్షిపణులను గాల్లోనే అడ్డగించే పేట్రియాట్ క్షిపణుల తయారీ సాంకేతికతను ఉక్రెయిన్‌కు ఇస్తామని హామీ ఇచ్చి తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట మార్చిన కొద్దిరోజులకే ఉక్రెయిన్‌పై ఇలా క్షిపణుల వాన కురవడం గమనార్హం. 24 బాలిస్టిక్ క్షిపణులు, మరో నాలుగు హైపర్‌సోనిక్ జిర్కోన్/సూపర్‌సోనిక్ ఓనిక్ క్రూజ్ క్షిపణులు, 115 డ్రోన్లను రష్యా ప్రయోగించింది. రష్యన్ కామకాజీ(ఆత్మాహుతి) డ్రోన్లుగా పేరుగాంచిన ఉపియర్ డ్రోన్లను తయారుచేసే ఉరాల్‌డ్రోన్ ప్లాంట్ సీఈఓ వ్లాదిమిర్ టకచుక్ కారు పేలుడులో తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం స్వెర్డ్‌లోవోస్క్ రీజియన్‌లోని సంస్థ తయారీ కర్మాగారం వద్ద కారు పేలుడు సంభవించింది. దీంతో అందులోని వ్లాదిమిర్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. కారు పేలుడుకు కారకులెవరనేది ఇంకా తెలియాల్సి ఉంది.

## నిరసనల్లో పాల్గొనే యువత పట్ల సహనంతో వ్యవహరించాలి

(మొదటి పేజీ తరువాయి)

కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థి ఆందోళనలు, వాటి సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసనల్లో పాల్గొంటున్న విద్యార్థుల పట్ల అధికారులు అత్యంత విచక్షణతో, సహనంతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. హింసను అదుపు చేసే నెపంతో భద్రతా బలగాలు కూడా అంతే తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగితే పరిస్థితులు మరింత దారి తప్పే ప్రమాదముందని హెచ్చరించింది. దేశ రాజధాని ఢిల్లీతో పాటు బీహార్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లలో సీజేపీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయని, జులై 20 నాటి నిరసనల్లో రాళ్లదాడి, హింస కారణంగా సార్వజనిక ఆస్తులకు జరిగిన నష్టానికి ఆ సంస్థనే బాధ్యులను చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కొత్త అర్జీని కూడా ఢిల్లీ తదితర ప్రాంతాల్లోని విద్యార్థి ఆందోళనలకు సంబంధించిన ప్రధాన కేసులతో సుప్రీంకోర్టు జతచేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుత ప్రదర్శనల సమయంలో పోలీసులు అత్యంత సంయమనం పాటించాలని సూచించిన సీజేఐ... యువత హింసాత్మక మార్గాల వైపు వెళ్లకుండా చూడటమే అధికారుల ప్రాథమిక విధి అని పేర్కొన్నారు. యువకులు అసలు ఏం కోరుకుంటున్నారు, వారి ఆవేదనకు కారణమేంటో ఓపికగా వినడమే అన్ని సమస్యలకు అత్యంత శక్తివంతమైన పరిష్కారమని వ్యాఖ్యానించారు. అయితే శాంతిభద్రతలను కాపాడే క్రమంలో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల విచక్షణపై తమకు నమ్మకం ఉందని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నివేదికలను పరిశీలించిన పిమ్మటే ఈ విషయంలో తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు ధర్మాసనం తెలిపింది.

## బెదిరింపులకు భయపడేది లేదు..

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. "ఈ యువత, వీరిలాంటి వేలాది మంది భారతీయ యువకులు చేసిన దానికి నేను గర్వపడుతున్నాను. వారు రాజ్యాంగాన్ని, భారత దేశ స్ఫూర్తిని, దేశ భవిష్యత్తును కాపాడారు. లోపభూయిష్టంగా, కుప్పకూలిపోతున్న పనికిమాలిన వ్యవస్థకు వ్యతిరేకంగా గళం విప్పడం నేరం కాదు. వారు తమ ప్రజాస్వామ్య హక్కును మాత్రమే వినియోగించుకున్నారు" అని అన్నారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో 15 ఏళ్ల బాలిక ప్రధాని నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఆ తర్వాత కేసు నమోదు కావడంతో ఆమె సోషల్ మీడియాలో క్షమాపణ చెప్పిన విషయం తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ సహా పలు పార్టీలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించాయి. బాలికను భయపెట్టి, బలవంతంగా క్షమాపణ చెప్పించారని ఆరోపించాయి. ఈ నేపథ్యంలో రాహుల్ స్పందిస్తూ.. విద్యార్థులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా తప్పుపట్టారు. "విద్యార్థులు శాంతియుతంగా, ఎటువంటి దూకుడు లేకుండా నిరసన తెలిపారు. అయినా వారిని కొట్టారు, వేధించారు, బెదిరించారు. ఇప్పుడు వారి ఇళ్ల వద్దకు గూండాలను పంపి, క్షమాపణ చెప్పాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇది పూర్తిగా అర్థరహితమైన చర్య. మేము దీనిని అంగీకరించం" అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించి, విద్యా వ్యవస్థలో అవసరమైన మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. మెరుగైన విద్యా వ్యవస్థ, పరీక్షా పత్రాల లీకేజీలకు ముగింపు, యువతకు సురక్షితమైన భవిష్యత్తు కావాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు.


## దిగొచ్చిన మెటా..

(మొదటి పేజీ తరువాయి)

ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ భారత ప్రభుత్వానికి క్షమాపణలు తెలిపారు. ప్రధాని మోదీ వీడియో తొలగింపు, తమ ప్లాట్‌ఫామ్‌లపై చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తి చెందడంపై ఆయన చింతిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు, తమ ప్లాట్‌ఫామ్‌ల నిర్వహణలో జరిగిన లోపాలను కూడా అంగీకరిస్తూ ఆయన విచారం వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీకి చెందిన ఓ ఫేస్‌బుక్ పోస్ట్‌ను కొద్దిసేపు తొలగించడంపై పార్లమెంటరీ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ వివాదంపై చర్చించేందుకు మెటా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఢిల్లీలో ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా, అభ్యంతరకర, తప్పుడు కంటెంట్ వ్యాప్తిపై భారత ప్రభుత్వం లేవనెత్తిన ఆందోళనలను మెటా ప్రతినిధులు అంగీకరించారని, ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లపై జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. యూజర్లకు ఏ కంటెంట్ చేరాలనేది ప్లాట్‌ఫామ్‌లే ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నప్పుడు, వాటిని కేవలం మధ్యవర్తులుగా పరిగణించలేమని భారత అధికారులు మెటాకు స్పష్టం చేసినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ఐటీ చట్టం కింద లభించే 'సేఫ్ హార్బర్' రక్షణ వర్తించదని తేల్చిచెప్పారు. కొన్ని రకాల కంటెంట్‌ను ప్రోత్సహించేందుకు (బూస్టింగ్) భారీగా డబ్బులు చెల్లించినట్లు మెటా అంగీకరించిందని, ఈ తప్పులకు విచారం వ్యక్తం చేసిందని కూడా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

# మళ్లీ మీరొస్తేనే మా బతుకులు మారేది

రాజమహేంద్రవరం: 'మీ పాలనలో కడుపు నిండా అన్నం తిన్నాం సార్.. చంద్రబాబు ప్రభుత్వంలో కూడు దొరకడం లేదు.. గిట్టుబాటు ధరా దక్కడం లేదు.. ఆత్మహత్యలే శరణ్యం సార్..' అంటూ పొగాకు రైతులు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎదుట కన్నీటిపర్యంతమయ్యారు. చంద్రబాబు ప్రభుత్వం నిర్వాకం కారణంగా మద్దతు ధర దక్కక ఆర్థికంగా చితికిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస గిట్టుబాటు ధర దక్కక ఇక్కట్లు పడుతున్న రైతులతో నేరుగా మాట్లాడి ధైర్యం చెప్పడానికి బుధవారం వైఎస్ జగన్ తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలోని పొగాకు కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిమాన నేత వైఎస్ జగన్‌ను చూడగానే కష్టాలు ఏకరువు పెట్టారు. 'ఈ పాలన ఏం బాగోలేదన్నా.. మీరొస్తేనే రైతు రాజ్యం వస్తుందన్నా.. మీ హయాం అన్నదాతలకు స్వర్ణ యుగం అన్నా..' అంటూ తమ ఆవేదన చెప్పుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాతల ఆవేదన వారి మాటల్లోనే.. పొగాకు రైతులు మిమ్మల్ని అమరావతిలో కలిశాక.. మీరు దేవరపల్లి వస్తున్నారని తెలుసుకుని చంద్రబాబు ప్రభుత్వం కిలోకు రూ.10 మద్దతు ధర పెంచింది. అయితే గ్రేడింగ్ పేరిట వ్యాపారులు ఆ మేరకు అంటే రూ.10 తగ్గించేశారు. ఈ ప్రభుత్వ మాయాజాలం ఇలా ఉంటోంది. ప్రస్తుతం కిలో రూ.170 నుంచి రూ.260 మధ్య కొనుగోలు చేస్తున్నారు. యావరేజ్ ధర రూ.230 కూడా రావడం లేదు. ఎకరాకు రూ.3 లక్షలపైనే ఖర్చవుతోంది. వ్యాపారులు సిండికేట్‌గా మారి నాణ్యమైన పొగాకును సైతం కిలో రూ.230కే తీసుకుంటున్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో సిండికేట్ వ్యాపారులకే మేలు జరుగుతోంది. సామాన్య రైతులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. అన్నా.. మన ప్రభుత్వంలో దేవరపల్లి బోర్డు పరిధిలో కిలో పొగాకుకు గరిష్టంగా రూ.385 దక్కింది. యావరేజ్‌గా రూ.365 దక్కేది. ఇప్పుడా పరిస్థితి లేనే లేదు. గ్రేడింగ్ పేరుతో వ్యాపారులు సిండికేట్‌గా మారి దోచేసుకుంటున్నారు. కిలోకు ఒక్కోసారి రూ.170 కూడా దక్కడం లేదు.



## కార్మికుల హక్కులను కాలరాయొద్దు

- భవన నిర్మాణ కార్మికులకు రూ.5 వేల పెన్షన్ కల్పించాలి
- ప్రతి కార్మికుడికి రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు నెలకు రూ.5 వేల పింఛనుతో పాటు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోచంపల్లి మండల కేంద్రంలోని తాపీ సంఘం భవనంలో బుధవారం ఏఐటీయూసీ మండల 3వ మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 106 ఏళ్లుగా కార్మికుల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతోందన్నారు. ఎనిమిది గంటల పనిదినం, కనీస వేతన చట్టం, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి హక్కులన్నీ పోరాటాల ద్వారా సాధించుకున్నవేనని గుర్తుచేశారు. కేంద్రం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను హరించేలా ఉన్నాయని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఈ నెల 25న భువనగిరిలో జరిగే ఏఐటీయూసీ యాదాద్రి భువనగిరి జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**ఏకగ్రీవంగా నూతన మండల కమిటీ ఎన్నిక:**

ఏఐటీయూసీ పోచంపల్లి మండల నూతన కమిటీని మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చేరాల లింగయ్య, గౌరవ సలహాదారులుగా కొత్త నరేష్, పెద్దల యాదయ్య, అధ్యక్షుడిగా కొండమడుగు బాలయ్య, ఉపాధ్యక్షులుగా కేతం నాగరాజు, తంగెల్ల దశరథ, ప్రధాన కార్యదర్శిగా కరగల్లా శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా చిందం నరసింహ, కొండమడుగు సత్తయ్య, కోశాధికారిగా కుక్క రమేష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా చెరుకు గాలయ్య, కుక్క భిక్షపతి, స్వామి, మూటపురం దానయ్య, చిందం నరసింహ తదితరులను ఎన్నుకున్నారు.

## ఆటో ట్రాలీ యూనియన్ పట్టణ అధ్యక్షుడిగా దశరథ

- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో పట్టణ ఆటో ట్రాలీ యూనియన్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా తంగెళ్ల దశరథ, గౌరవ అధ్యక్షుడిగా పోనమోని సహదేవ్, ఉపాధ్యక్షుడిగా పెద్దల వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా గోరుగంటి నవీన్, కోశాధికారిగా ఒంటెద్దు రమేష్, సహాయ కార్యదర్శిగా బండిరాళ్ల అశోక్ ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా మూట మల్లేష్, పోనమోని బాలరాజు, పోనమోని సాయిలు, చెక్క రమేష్, పెద్దల మల్లేష్‌లను ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పోనమోని భిక్షపతి, శ్యామల లింగస్వామి, కొండమడుగు సత్యం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు.. అమృతతుల్యం!

- తల్లిపాలతోనే శిశువులకు రోగనిరోధక శక్తి
- గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి
- అవగాహన సదస్సులో సర్పంచ్ రవీందర్ రెడ్డి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** శిశువులకు తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ధర్మారెడ్డిపల్లి సర్పంచ్ సామ రవీందర్ రెడ్డి అన్నారు. భూదాన్ పోచంపల్లి మండలంలోని ధర్మారెడ్డిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై గర్భిణులకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు తల్లిపాలు అందించడం ద్వారా వారు రోగనిరోధక శక్తిని పొంది ఆరోగ్యవంతంగా ఎదుగుతారని చెప్పారు. గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంతో పాటు బిడ్డల ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. రోజువారీగా గుడ్లు, పాలు, చేపలు, ఆకుకూరలు అధికంగా తమ ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొమిరి విజయ్, వార్డు సభ్యులు సాంబ సులోచన, మనగంటి నరసింహ, కనకబోయిన లావణ్య, కొమిరి అంజమ్మ, మాజీ ఉపసర్పంచ్ కాటమరాజు జంగారెడ్డి, అంగన్‌వాడీ టీచర్ రజిత, ఆరోగ్య కార్యకర్త సునీత తదితరులు పాల్గొన్నారు.



## కార్మికుల హక్కులపై కేంద్రం గొడ్డలిపెట్టు

- కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న బీజేపీ సర్కారు
- లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి
- ఆగస్టు 10న 'జైల్ భరో'కు కదలిరావాలి: సీఐటీయూ



**తొలివెలుగు, వలిగొండ:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న తలపెట్టిన 'జైల్ భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం వలిగొండ వ్యవసాయ మార్కెట్‌లో జైల్ భరో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికుల శ్రమను దోచుకునేలా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడంతో పాటు విద్యుత్ సవరణ బిల్లు, 2025 విత్తనాల చట్ట సవరణలు తెచ్చిందన్నారు. సులభతర వ్యాపారం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పేరుతో పెట్టుబడిదారులకు గరిష్ట లాభాలు చేకూర్చేందుకు కార్మిక చట్టాలను రద్దు చేస్తోందని మండిపడ్డారు. పనిగంటలను 8 నుంచి 12 గంటలకు పెంచడం, సమ్మె హక్కును కాలరాయడం, కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్ కష్టతరం చేయడం దారుణమన్నారు. 300 మంది లోపు కార్మికులున్న కంపెనీల్లో నోటీసు లేకుండానే తొలగించే 'హైర్ అండ్ ఫైర్' విధానం ఉద్యోగ భద్రతను దెబ్బతీస్తోందన్నారు. అసంఘటిత రంగాలైన భవన నిర్మాణ, హమాలీ, రవాణా కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని, స్కీం వర్కర్లైన అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన, ఐకేపీ వీఓఏ, ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఈ విధానాలను తిప్పికొట్టేందుకు క్విట్ ఇండియా స్ఫూర్తితో కార్మికులు జైల్ భరోలో కదం తొక్కాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తూర్కపల్లి సురేందర్, హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జన్ని జంగయ్య, నాయకులు గాడిపల్లి నర్సింహ, ఇస్తారి, రాములు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల లేమిపై ఆగ్రహం.. చదువుపై ప్రశంసలు






- రాజాపేట గురుకులాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి
- రూ. 2.65 కోట్ల మరమ్మతు పనుల నాణ్యత లోపం పట్ల అసహనం
- రాజాపేట గురుకులంలో వసతుల లేమిపై ప్రిన్సిపాల్ ఆవేదన
- మరమ్మతుల జాప్యం, నాణ్యతా లోపంపై కలెక్టర్ ఫైర్
- కుళ్లిన అరటిపండ్లు, మెనూ ఎగవేతపై కాంట్రాక్టర్‌కు వార్నింగ్
- ఫలితాల్లో మాత్రం రాజాపేట గురుకులం భేష్: కలెక్టర్ ప్రశంసలు



**తొలివెలుగు, రాజాపేట:** ప్రభుత్వ గురుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. బుధవారం రాజాపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గంట పాటు డైనింగ్, వంటశాల, తరగతి గదులు, మైదానం, స్టోర్ రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు.

**సౌకర్యాలపై అసంతృప్తి:**

గురుకులంలో రూ.2.65 కోట్లతో చేపడుతున్న మరమ్మతు పనుల్లో నాణ్యత లోపించడం, జాప్యం జరగడంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్, సంబంధిత ఏఈ శ్రీనివాస్‌లను నిలదీశారు. మరుగుదొడ్లు పూర్తిగా అధ్వానంగా ఉన్నాయని, 519 మంది విద్యార్థులు ఆరుబయటే మలమూత్ర విసర్జన చేస్తున్నారని ప్రిన్సిపాల్ సుధాకర్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. రెండు నెలల్లో నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దోమల నివారణకు పీవీసీ కిటికీలు, మెష్ డోర్లు ఏర్పాటు చేయాలన్నారు. పెచ్చులూడుతున్న గదుల్లో విద్యాబోధన చేయొద్దని సూచించారు. స్టోర్ రూమ్‌లో కుళ్లిన అరటి పండ్లు ఉండటం, బుధవారం మెనూ ప్రకారం పిల్లలకు చికెన్, గుడ్డు పెట్టకపోవడంపై మండిపడ్డారు. కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. డార్మెటరీని పరిశీలించిన కలెక్టర్.. విద్యార్థులతో కలిసి కాసేపు ముచ్చటించారు. భవిష్యత్తులో కలెక్టర్ అవుతానని 7వ తరగతి విద్యార్థి కార్తీక్ ధీమాగా చెప్పడంతో కలెక్టర్ అతన్ని అభినందించారు.

**రాజాపేట గురుకులం విధానాలు జిల్లా అంతటా:**

నీట్, జేఈఈ మెయిన్స్, ట్రిపుల్ ఐటీల్లో గురుకుల విద్యార్థులు అత్యధిక సీట్లు సాధించడం పట్ల ప్రిన్సిపాల్ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బామండ్ల రాజులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. డీఈఓ భిక్షపతికి ఫోన్ చేసి, రాజాపేట విద్యావిధానాన్ని జిల్లాలోని అన్ని గురుకులాల్లో అమలు చేయాలని ఆదేశించారు. క్రీడల్లోనూ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడంపై పీఈటీ శృతి, కోచ్ పవన్‌లను ప్రశంసించారు. అవసరమైన బెంచీల కోసం ఇండెంట్ పంపాలని సూచించారు. ఈ తనిఖీలో పీఆర్ ఎస్ఈ విష్ణువర్ధన్ రావు, తహసీల్దార్ రవికిరణ్, ఎంపీడీవో నాగవేణి, ఎంపీఓ కిషన్, సర్పంచ్ మధు, గురుకుల సిబ్బంది పాల్గొన్నారు. ఒకరోజు ముందు శిక్షణ కలెక్టర్ కృతిక సైతం గురుకులాన్ని సందర్శించి పనులపై అసంతృప్తి, ఫలితాలపై హర్షం వ్యక్తం చేశారు.



## సీత సుధాకర్‌కు 'కొండా లక్ష్మణ్ బాపూజీ' పురస్కారం


- ఇక్కత్ స్పెషల్ డిజైనింగ్ విభాగంలో ఎంపిక
- అటవీ నేపథ్యంతో అద్భుత చీర రూపకల్పన

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా చేనేత కళాకారులకు ప్రదానం చేసే ప్రతిష్టాత్మక 'కొండా లక్ష్మణ్ బాపూజీ' అవార్డు ఈ ఏడాది యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లికి చెందిన మాస్టర్ వీవర్ సీత సుధాకర్‌ను వరించింది. స్పెషల్ డిజైనింగ్ (ఇక్కత్) విభాగంలో ఆయన ఈ పురస్కారానికి ఎంపికైనట్లు రాష్ట్ర చేనేత కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని జిల్లా చేనేత సహాయ సంచాలకులు (ఏడీ) శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా అవార్డుకు ఎంపిక కావడం పట్ల సీత సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. 'ఫారెస్ట్ థీమ్' (అటవీ నేపథ్యం) తో ఓ ఇక్కత్ చీరను ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ చీరలో ఏనుగు, సింహం, హంస, కొంగ, నెమలి, కింగ్‌ఫిషర్, రామచిలుక, బాతు తదితర పక్షులు, జంతువుల బొమ్మలు వచ్చేలా మగ్గంపై అద్భుతంగా తీర్చిదిద్దారు. ఇక చీర కొంగు (పవిట అంచు) విషయానికొస్తే.. ఏనుగు, ఆవు, నెమలి, హంస, సింహం, జింక తదితర జంతువులు ఉండేలా విభిన్న రంగులతో రూపొందించారు. అత్యంత క్లిష్టమైన ఈ డిజైన్‌ను నేయడానికి నెల రోజులకు పైగా సమయం పట్టిందని సుధాకర్ వివరించారు. చేనేత దినోత్సవం సందర్భంగా ఈ అవార్డు అందుకోనుండటం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు.



# ఐక్యతతోనే గౌడ కులస్తుల అభివృద్ధి





- రాయదుర్గంలో గౌడ సంఘం భవనం ప్రారంభం
- సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణలో మధుయాష్కి గౌడ్

**తొలివెలుగు, ఎల్బీనగర్:** గౌడ కులస్తులు ఐక్యంగా ఉన్నప్పుడే సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అగ్రగామిగా ఎదుగుతారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అన్నారు. రాయదుర్గం గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సంఘం భవనాన్ని బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ గౌడ్‌లతో కలిసి బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. కులంలో ఐక్యత లేకపోతే అన్ని రంగాల్లో వెనుకబడతామని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థికంగా ఎదిగిన వారు ఏ వృత్తిలో ఉన్నా, తోటి కులస్తులకు చేయూతనివ్వాలని సూచించారు. కులంలో ఎవరికైనా రాజకీయ అవకాశాలు వచ్చినప్పుడు అందరూ ఏకతాటిపై నిలిచి ప్రోత్సహించాలని, వారు ఉన్నత స్థానాలకు చేరితే భవిష్యత్తులో మిగతా వారికీ అవకాశాలు దక్కుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, ఆనంద్ గౌడ్, రాయదుర్గం గౌడ సంఘం అధ్యక్షుడు రాములు గౌడ్, వెంకటేష్ గౌడ్, భరత్ కుమార్ గౌడ్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్ గౌడ్, సుధాకర్ గౌడ్, సాయికుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు ఆసరా.. సీఎం సహాయనిధి

- శోభనాద్రిపురంలో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ
- ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో మంజూరు



**తొలివెలుగు, రామన్నపేట:** ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతో ఆసరాగా నిలుస్తోందని శోభనాద్రిపురం సర్పంచ్ కంచి మధుసూదన్ అన్నారు. రామన్నపేట మండలం శోభనాద్రిపురం గ్రామానికి చెందిన పోశబోయిన నరసింహ, ఇప్ప మౌనికలకు సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థిక సాయం మంజూరైంది. నకిరేకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ వేముల వీరేశం ప్రత్యేక చొరవతో మంజూరైన ఈ చెక్కులను బుధవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న బాధితులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు భరోసానిస్తున్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఏటెల్లి పరమేష్, పాలకవర్గ సభ్యులు సతీష్, సునీత, రమణ, లతీఫ్, అంజమ్మ, కుమారస్వామి, మేకల స్వామి, మాజీ సర్పంచ్ బొడిగె చంద్రకళ శ్రీనివాస్ గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ నంగునూరు నరేష్, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు తాడూరి సైదులు, సాయి గౌడ్, సైదులు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# ఆపత్కాలంలో అండగా 'సీఎంఆర్ఎఫ్'

- బాధిత కుటుంబాలకు ఆర్థిక చేయూత

2 లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన నాయకులు

2 ఎమ్మెల్యే వేముల వీరేశంకు లబ్ధిదారుల కృతజ్ఞతలు



**తొలివెలుగు, రామన్నపేట:** ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) పెద్ద దిక్కుగా నిలుస్తోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. నకిరేకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ వేముల వీరేశం ప్రత్యేక కృషితో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం రామన్నపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు వారు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అనారోగ్యం లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రుల పాలై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తోందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే వేముల వీరేశం నిరంతరం అందుబాటులో ఉంటూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆర్థిక సాయం అందడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరుద్దీన్, వార్డు సభ్యుడు మోటే మహేష్, కందుల అండాలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండ అంజిరెడ్డి, యాదయ్య, పిట్ట రామిరెడ్డి, శంబాల వెంకన్న, చింతల కృష్ణ, గొలుసుల ప్రసాద్, మాల్గ వెంకటేష్, బండ బాలరాజ్, బొడ్డు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం




- వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో 'సైబర్ జాగరూకత'
- పార్కులు, కళాశాలల్లో విస్తృత అవగాహన సదస్సులు
- బాధితులు వెంటనే '1930'కి ఫిర్యాదు చేయాలి

**తొలివెలుగు, వనస్థలిపురం:** నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వనస్థలిపురం పోలీసులు సూచించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఆదేశాల మేరకు, సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్ సహకారంతో బుధవారం వనస్థలిపురం పరిధిలో విస్తృత స్థాయిలో 'సైబర్ జాగరూకత' అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

**వివిధ ప్రాంతాల్లో సదస్సులు:**

ఉదయం ఇంజాపూర్‌లోని సంజీవని వనం పార్కు (50 మంది), ఎన్‌జీఓస్ కాలనీలోని వివేకానంద పార్కు (40 మంది), ఆటోనగర్‌లోని డీర్ పార్కు (50 మంది) లలో సందర్శకులకు అవగాహన కల్పించారు. అనంతరం సాగర్ కాంప్లెక్స్ సమీపంలోని కృష్ణవేణి కళాశాలలో సుమారు 300 మంది విద్యార్థులతో ప్రత్యేక సదస్సు నిర్వహించారు.



**మోసాల తీరుపై వివరణ:**

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, పార్ట్‌టైమ్ జాబ్ మోసాలు, ఓటీపీ షేరింగ్, డిజిటల్ అరెస్ట్ బెదిరింపులు, ఫోటో మార్ఫింగ్, డేటా హ్యాకింగ్ వంటి నేరాలు ఎలా జరుగుతున్నాయో ఉదాహరణలతో వివరించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు గానీ, నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో గానీ ఫిర్యాదు చేస్తే పోయిన డబ్బును రికవరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, సైబర్ క్రైమ్స్ ఏసీపీ శివశంకర్, వనస్థలిపురం సీఐ రవిబాబు, సైబర్ క్రైమ్స్ ఇన్‌స్పెక్టర్లు కృష్ణంరాజు, నాగచారి, ఎస్ఐలు గిరీష్, నాగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీలో చేరేందుకు 'లాస్ట్ ఛాన్స్'

- నేటి నుంచి దోస్త్ స్పెషల్ డ్రైవ్ రిజిస్ట్రేషన్లు
- అడ్మిషన్ పొందిన వారికి కోర్సు మార్పునకు అవకాశం
- వివరాలు వెల్లడించిన రామన్నపేట ప్రిన్సిపాల్ రాహత్ ఖానం



**తొలివెలుగు, రామన్నపేట:** ఇప్పటికీ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ పొందని విద్యార్థులకు దోస్త్ స్పెషల్ డ్రైవ్ రూపంలో ప్రభుత్వం చివరి అవకాశం కల్పించిందని రామన్నపేట స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం తెలిపారు. ఆగస్టు 6 నుంచి 11వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, 12వ తేది వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 14న సీట్లు కేటాయిస్తారని, సీటు సాధించిన విద్యార్థులు 14 నుంచి 18 వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి, 17, 18 తేదీల్లో ఒరిజినల్ టీసీ, జిరాక్స్ సర్టిఫికెట్లతో కళాశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

**కోర్సు మార్చుకోవాలంటే:**

ఇప్పటికే కళాశాలలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు కోర్సు మార్చుకునేందుకు ఇంట్రా కాలేజ్ ఫేజ్-2 ద్వారా అవకాశం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆగస్టు 20, 21 తేదీల్లో దోస్త్ లాగిన్ ద్వారా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని, 22న సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. డిగ్రీ ప్రవేశాలకు ఇదే చివరి అవకాశం కావడంతో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉత్తమ వసతులు, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం ఉన్న రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధిక సంఖ్యలో చేరాలని పిలుపునిచ్చారు. ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో గానీ, నేరుగా కళాశాల కార్యాలయంలో గానీ సంప్రదించవచ్చని తెలిపారు.

# చౌటుప్పల్-వలిగొండ రహదారి పనుల్లో జాప్యమేల?

- ఆర్డీఓ కార్యాలయంలో బీఎస్పీ నాయకుల వినతి
- యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని డిమాండ్
- బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు తగరం సుభాష్ చంద్రబోస్

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్-వలిగొండ రహదారి విస్తరణ, నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో నిత్యం ప్రయాణించే వేలాది మంది విద్యార్థులు, రైతులు, కార్మికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు తగరం సుభాష్ చంద్రబోస్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం చౌటుప్పల్ ఆర్డీఓకు పార్టీ నాయకులతో కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం రద్దీగా ఉండే ఈ కీలక రహదారిపై గుంతలు, దుమ్ము ధూళితో వాహనదారులు, బాటసారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ప్రజల పన్నుల డబ్బుతో చేపట్టే అభివృద్ధి పనుల్లో జాప్యానికి బాధ్యులెవరో ప్రభుత్వం, సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పనుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ, యుద్ధప్రాతిపదికన రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. రహదారి పూర్తయ్యే వరకు ప్రజల పక్షాన బీఎస్పీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ కోశాధికారి మాద రమేష్, నాయకులు మస్కు ఉదయ్, కత్తుల నర్సింహా, రమేష్, రఘునాథ్, సాయి తేజ, తగరం నర్సింహా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# నేడే పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలో ఓరియంటేషన్

- నూతన బీటెక్ విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన
- ముఖ్య అతిథిగా సత్యం కంప్యూటర్స్ మాజీ సీఈఓ ఏ.ఎస్. మూర్తి
- కార్యక్రమానికి అధ్యక్షత వహించనున్న ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య

**తొలివెలుగు, ఎల్బీనగర్:** పల్లవి ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్) ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరంలో కొత్తగా ప్రవేశం పొందిన బీటెక్ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం గురువారం కళాశాల ప్రాంగణంలో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్ర శాసనమండలి సభ్యులు, డీపీఎస్ పల్లవి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ మల్క కొమరయ్య అధ్యక్షతన ఈ వేడుక జరగనుందని కళాశాల యాజమాన్యం తెలిపింది.

**హాజరుకానున్న ప్రముఖులు:**

ఈ కార్యక్రమానికి సత్యం కంప్యూటర్ సర్వీసెస్ మాజీ తాత్కాలిక సీఈఓ ఏ.ఎస్. మూర్తి (అచుట్ని శ్రీనివాస్ మూర్తి) ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. గౌరవ అతిథులుగా క్రిటికల్‌రివర్ ఇంక్ సీనియర్ డైరెక్టర్, గ్లోబల్ టాలెంట్ అక్విజిషన్ హెడ్ దేవవరం సోలమన్, క్యాపిటెక్ సొల్యూషన్స్ డైరెక్టర్ గణేష్ సోమిశెట్టి పాల్గొననున్నారు.

**పరిశ్రమల అవసరాలపై మార్గదర్శనం:**

ఇంజినీరింగ్ విద్యలో వస్తున్న నూతన మార్పులు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పెంచుకోవాల్సిన సాంకేతిక నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, భవిష్యత్ కెరీర్ ప్రణాళికపై నిపుణులు విద్యార్థులకు దిశానిర్దేశం చేయనున్నారు. వీటితో పాటు స్వయం ప్రతిపత్తి (అటానమస్) వ్యవస్థ, అకాడమిక్ నిబంధనలు, పరీక్షల విధానం, హాజరు శాతాలు, విద్యార్థుల ప్రవర్తనా నియమావళి, శిక్షణ-ప్లేస్‌మెంట్‌లు, ఇంటర్న్‌షిప్‌ల గురించి సమగ్రంగా వివరించనున్నారు. నూతన విద్యార్థులు కళాశాల వాతావరణానికి సులభంగా అలవాటు పడేలా చేయడం, విద్యార్థులు - తల్లిదండ్రులు - అధ్యాపకుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని యాజమాన్యం పేర్కొంది.



## కార్మిక హక్కులను కాలరాస్తే ఊరుకోం!

- 4 లేబర్ కోడ్లు, విద్యుత్ బిల్లును రద్దు చేయాలి
- ఆగస్టు 10న 'జైల్ భరో'ను విజయవంతం చేయాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం హెచ్చరిక

**తొలివెలుగు, చౌటుప్పల్:** కార్మికులు ఎన్నో పోరాటాలతో సాధించుకున్న హక్కులను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్లను తీసుకురావడం దారుణమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం మండిపడ్డారు. చౌటుప్పల్ మండలం మల్కాపురం గ్రామంలో బుధవారం భవన నిర్మాణ కార్మిక సంఘం, అందోల్ మాతా ట్రాక్టర్ డ్రైవర్స్ యూనియన్ల సాధారణ సర్వసభ్య సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. పని గంటలను 8 నుంచి 12 గంటలకు పెంచడం, 'హైర్ అండ్ ఫైర్' విధానాలతో కార్మికులను యజమానుల దయాదాక్షిణ్యాలపై వదిలేయడం దుర్మార్గమన్నారు. విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల రైతులు దివాళా తీస్తున్నారని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు మద్దతు ధర ఇచ్చి, రుణవిమోచన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. వీబీజీ రామ్ జీ పథకాన్ని రద్దు చేసి పాత ఉపాధి హామీని కొనసాగించాలని, విద్యుత్ సవరణ బిల్లు-2025ను ఉపసంహరించుకోవాలని స్పష్టం చేశారు. 'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఆగస్టు 10న చేపడుతున్న 'జైల్ భరో' ఆందోళనలో కార్మికులు, రైతులు విరివిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యండి పాషా, ఆదిమూలం నందీశ్వర్, దౌడి యాదగిరి, అంజయ్య, నరసింహ, సుదర్శన్, పాండు, మల్లయ్య, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే కొండంత అండ.. పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

- అంకిరెడ్డిగూడెంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు
- చిన్నారులకు అన్నప్రాసన చేయించిన సర్పంచ్ మల్లేష్ గౌడ్
- అంగన్వాడీ కార్యకర్తల సేవలు అభినందనీయం: సర్పంచ్



**తొలివెలుగు, చౌటుప్పల్:** నవజాత శిశువుల సమగ్ర ఎదుగుదలకు, సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలే కొండంత అండ అని అంకిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ అన్నారు. బుధవారం అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని 1, 2 అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అన్నప్రాసన కార్యక్రమం, ఆరోగ్య లక్ష్మి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు పట్టడం ఎంతో అవశ్యకమన్నారు. చిన్నారుల బరువు, ఎదుగుదల వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు చక్కటి కౌన్సెలింగ్, మోటివేషన్ ఇస్తున్న అంగన్వాడీ టీచర్లు నల్ల జయప్రద, సప్పిడి కల్పనలను ఈ సందర్భంగా సర్పంచ్ అభినందించారు. గ్రామంలో పుట్టబోయే ప్రతీ బిడ్డ భవిష్యత్తు, ఆరోగ్యంపై అంగన్వాడీ టీచర్ల బాధ్యత ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు పెండెం లక్ష్మి, ఉపాధ్యాయులు లక్ష్మణాచారి, ఎంపీహెచ్ఏ (ఎఫ్) జె. పద్మ, ఆశా వర్కర్లు బొడిగె అమృత, బొల్లు అండాలు, గర్భిణులు, బాలింతలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.



# నిబంధనలు పాటిస్తేనే ప్రయాణాలు సురక్షితం




- వలిగొండ, చౌటుప్పల్‌లో ట్రాఫిక్ అవగాహన సదస్సులు
- ఆటో డ్రైవర్లు, విద్యార్థులకు రోడ్డు భద్రతపై పోలీసుల మార్గదర్శనం

**తొలివెలుగు, చౌటుప్పల్/వలిగొండ:** రహదారి నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం వలిగొండలో స్థానిక ప్రజలు, ఆటో డ్రైవర్లకు, చౌటుప్పల్‌లోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సురక్షిత ప్రయాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు కారణమవుతాయని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చన్నారు. వాహనాలను అతివేగంగా నడపరాదని, మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు వినియోగించుకోవాలని సూచించారు. అలాగే వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించరాదని, ట్రాఫిక్ సంకేతాలు, రహదారి నియమాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పాదచారులు కూడా రోడ్డు దాటే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, జీబ్రా క్రాసింగ్‌లు, ట్రాఫిక్ సిగ్నల్లను వినియోగించాలని సూచించారు. అనంతరం చౌటుప్పల్‌లోని కృష్ణవేణి పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. చిన్నతనం నుంచే ట్రాఫిక్ నియమాలను పాటించే అలవాటు పెంపొందించుకోవాలని, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.




## రోడ్డు భద్రత.. సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

**జేబీఎం ఒకేషనల్ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు**

**- ట్రాఫిక్ నిబంధనలు పాటించి.. ఆన్‌లైన్ మోసాల నుంచి అప్రమత్తంగా ఉండాలి: సీఐ మన్మథ కుమార్**




**తొలివెలుగు, చౌటుప్పల్:** సైబర్ స్వాతంత్ర తెలంగాణ కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని మార్కండేయ నగర్‌లో ఉన్న జేబీఎం ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బుధవారం రోడ్డు భద్రత, సైబర్ మోసాల నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల తీవ్రతను తగ్గించడంతో పాటు ప్రాణాలను రక్షించుకోవచ్చని తెలిపారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన వల్లే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అనంతరం పీసీ మమత సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులు తెరవవద్దని, అనుమానాస్పద కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత హెల్ప్‌లైన్ (1930)కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అజయ్ భార్గవ్, కళాశాల ప్రిన్సిపాల్ గంగాపురం జంగయ్య, కరస్పాండెంట్ నిర్మల, అధ్యాపకులు మాధవి, రంజిత్, యువరాజు, స్వాతి, మమత, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిరుపేదల ఆరోగ్యానికి 'సీఎంఆర్ఎఫ్' భరోసా

**- దేవలమ్మ నాగారం బాధితురాలికి రూ.1.50 లక్షల ఎల్ఓసీ చెక్కు అందజేత**

**- ఆపదలో ఉన్న పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం: సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్**

**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రైవేటు ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్య చికిత్స చేయించుకోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) గొప్ప వరమని దేవలమ్మ నాగారం గ్రామ సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన సిలివేరు పద్మమ్మకు మంజూరైన రూ. 1.50 లక్షల విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) చెక్కును బుధవారం కుటుంబ సభ్యులకు ఆమే అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సిలివేరు పద్మమ్మ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం తెలిసిన వెంటనే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి చికిత్స కోసం రూ. 1.50 లక్షల విలువైన ఎల్ఓసీ చెక్కు మంజూరు చేయించారని తెలిపారు. ఆపద సమయంలో నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎల్లప్పుడూ ముందుంటారని అన్నారు. చెక్కు మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రామాలయ చైర్మన్ పన్నాల రాజిరెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ సుర్కంటి అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ శ్వేత, బొమ్మ అమరావతి, ఫాతిమా, దోనూరి కిరణ్ రెడ్డి, పాక రాము, సుంకరి శ్రీను, దేశట్ల చైతన్య, కాంగ్రెస్ నాయకుడు రాసాల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.






## అమృతతుల్యం.. తల్లిపాలు

- డబ్బా పాలు వద్దు.. ముర్రుపాలే ముద్దు!
- పులిగిల్లలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు
- హాజరైన సర్పంచ్ అనూష, వైద్య సిబ్బంది




**తొలివెలుగు, వలిగొండ:** గ్రామీణం: నవజాత శిశువుల సమగ్ర ఎదుగుదలకు, సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలే అత్యంత శక్తివంతమైన అమృతమని, కృత్రిమ డబ్బా పాలకు దూరంగా ఉండటమే బిడ్డ భవిష్యత్తుకు క్షేమకరమని పులిగిల్ల సర్పంచ్ వేముల అనూష అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పులిగిల్ల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి జోగు సైదులుతో కలిసి ఆమె ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తప్పనిసరిగా ముర్రుపాలు పట్టాలని తెలిపారు. ముర్రుపాలు పిల్లల జీర్ణశయాన్ని శుభ్రపరచడమే కాకుండా, సహజ సిద్ధమైన వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించి అనేక రకాల రోగాల నుంచి రక్షణ కల్పిస్తాయన్నారు. క్రమం తప్పకుండా తల్లిపాలు పట్టడం ద్వారా తల్లికి సైతం అనేక వ్యాధులు దూరమవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు బందారపు మంగమ్మ, భోగ శ్రీలత, బంధారపు మహేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ బాలజ్యోతి, ఏఎన్ఎమ్ స్వరూప, ఆశా వర్కర్లు వరకంతం మమత, మామిడి సుజాత, శికిలం అచ్చమ్మ, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



## ఎయిరిండియా కొత్త సీఈవోగా టెవోల్డే గెబ్రెమరియమ్ నియామకం

భారీ నష్టాలతో సతమతమవుతూ, పలు సవాళ్లను ఎదుర్కొంటున్న టాటా గ్రూప్ సంస్థ ఎయిరిండియాలో కీలక మార్పు చోటుచేసుకుంది. సంస్థ కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో), మేనేజింగ్ డైరెక్టర్‌గా ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ మాజీ చీఫ్ టెవోల్డే గెబ్రెమరియమ్‌ను నియమిస్తున్నట్లు బుధవారం నాడు ప్రకటన వెలువడింది. ప్రస్తుత సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో గెబ్రెమరియమ్ బాధ్యతలు చేపట్టనున్నారు. గతేడాది అహ్మదాబాద్‌లో జరిగిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాదం, పేరుకుపోతున్న నష్టాల నేపథ్యంలో ఈ మార్పు ప్రాధాన్యత సంతరించుకుంది. గెబ్రెమరియమ్ ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ సీఈవోగా దశాబ్దానికి పైగా పనిచేసి, ఆ సంస్థను ఆఫ్రికాలోనే అతిపెద్ద, అత్యంత లాభదాయకమైన విమానయాన సంస్థగా తీర్చిదిద్దారు. ఆయన నాయకత్వంలో ఆ సంస్థ ఆదాయం నాలుగు రెట్లు, విమానాల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. క్లిష్టమైన కార్యకలాపాల నిర్వహణ, అంతర్జాతీయ హబ్‌లను నిర్మించడం, నిర్వహణ-మరమ్మతుల మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంలో ఆయనకు అపారమైన అనుభవం ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఎయిరిండియా 2.8 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 23,000 కోట్లు) భారీ నష్టాన్ని నమోదు చేసింది. దీనికి తోడు పాకిస్థాన్ గగనతలం మూసివేత, మధ్యప్రాచ్య ఉద్రిక్తతల కారణంగా పలు అంతర్జాతీయ విమానాలను రద్దు చేయాల్సి వచ్చింది. ఈ సవాళ్ల మధ్య సంస్థ పునరుద్ధరణ ప్రణాళికలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ఎయిరిండియాను వృద్ధి, లాభదాయకత దిశగా నడిపించేందుకు గెబ్రెమరియమ్ సరైన వ్యక్తి అని బోర్డు ఏకగ్రీవంగా విశ్వసించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. టాటా సన్స్, ఎయిరిండియా ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మాట్లాడుతూ, “స్థిరీకరణ, విలీనం వంటి ప్రాథమిక దశలు పూర్తయ్యాయి. ఇప్పుడు ఎయిరిండియా వృద్ధి, విస్తరణ దశలోకి ప్రవేశిస్తోంది. గెబ్రెమరియమ్ అనుభవం సంస్థను ఒక ఉన్నతమైన గ్లోబల్ క్యారియర్‌గా నిలబెట్టడానికి దోహదపడుతుంది” అని అన్నారు. 2022లో టాటా గ్రూప్ ఎయిరిండియాను టేకోవర్ చేశాక సింగపూర్ ఎయిర్‌లైన్స్ మాజీ ఎగ్జిక్యూటివ్ అయిన క్యాంప్‌బెల్ విల్సన్‌ను సీఈవోగా నియమించింది. విలీన ప్రక్రియలను పర్యవేక్షించడం, భారీ విమానాల కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకోవడం వంటి ప్రాథమిక దశలో ఆయన అందించిన సేవలకు బోర్డు కృతజ్ఞతలు తెలిపింది.

## విజయ్ సర్కారు తొలి బడ్జెట్‌పై స్టాలిన్ స్పందన ఇదే!

తమిళనాడులో కొత్తగా కొలువుదీరిన టీవీకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌పై డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బడ్జెట్ పూర్తిగా నిరాశపరిచిందని, ఇందులో కొత్తదనం లేదని, దూరదృష్టితో కూడిన పథకాలు కరవయ్యాయని ఆయన విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన కీలక హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై స్టాలిన్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. “ప్రజలు దీన్ని ఒక ‘బ్లాస్ట్’ అనుకుంటే, ఇది ‘వేస్ట్’గా తేలింది. ఇది గత ‘ద్రవిడ మోడల్’ ప్రభుత్వ బడ్జెట్‌కు రీమేక్ తప్ప మరొకటి కాదు” అని స్టాలిన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం నుంచి ప్రజలు భారీ ప్రకటనలు ఆశించారని, కానీ వారి ఆశలన్నీ అడియాసలయ్యాయని అన్నారు. “ఈ బడ్జెట్ బాంబులా పేలుతుందని అందరూ అనుకుంటే, చివరికి తుస్సుమన్న పటాసులా మారింది” అని ఆయన ఎద్దేవా చేశారు. గత డీఎంకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకే కొత్త రంగులు పులిమి, తమవిగా ప్రచారం చేసుకుంటున్నారని ఆక్షేపించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యుత్ బిల్లుల గందరగోళం, పెరుగుతున్న నిత్యావసరాల ధరలు వంటి ప్రధాన సమస్యలను బడ్జెట్‌లో ఏమాత్రం ప్రస్తావించలేదని స్టాలిన్ మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో టీవీకే ఇచ్చిన ప్రధాన హామీల గురించి బడ్జెట్‌లో మౌనం వహించడంపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. “మహిళలకు నెలకు రూ.2,500, నిరుద్యోగ యువతకు రూ.4,000, ఏడాదికి ఆరు ఉచిత గ్యాస్ సిలిండర్లు, పంట రుణాల పూర్తి మాఫీ వంటి హామీల ఊసే లేదు” అని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రానికి దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికను అందించడంలో ఈ బడ్జెట్ విఫలమైందని స్టాలిన్ దుయ్యబట్టారు. మరోవైపు, ప్రతిపక్ష నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా బడ్జెట్‌పై విమర్శలు గుప్పించారు. గత డీఎంకే ప్రభుత్వం ప్రారంభించిన అనేక పథకాల పేర్లను మార్చి, టీవీకే ప్రభుత్వం తమవిగా చెప్పుకుంటోందని ఆయన ఆరోపించారు. చెన్నైలోని సెక్రటేరియట్‌లో బడ్జెట్ ప్రసంగం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త పథకాలను తీసుకురాకుండా, పాతవాటినే కొత్త కార్యక్రమాలుగా చూపే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. ప్రభుత్వం నెరవేర్చని హామీలపై అసెంబ్లీలో నిలదీస్తామని ఉదయనిధి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, తంజావూరులో నటి త్రిషకు సంబంధించి చేసిన వ్యాఖ్యల కేసులో మంగళవారం పోలీసులు తనను అదుపులోకి తీసుకోవడాన్ని ఉదయనిధి ప్రస్తావించారు. బడ్జెట్ సమావేశాలకు ముందు ప్రతిపక్ష నేతగా ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా అడ్డుకునేందుకే తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని డీఎంకే ఆరోపిస్తోంది.



## ఎన్విడియా అధినేత జెన్సన్ హువాంగ్

టెక్నాలజీ ప్రపంచంలో సంచలనాలు సృష్టిస్తున్న ఎన్విడియా (చీజఱఅఱు) సంస్థ సీఈవో జెన్సన్ హువాంగ్, తన అద్భుతమైన విజయం వెనుక ఉన్న ఒక ఆసక్తికరమైన రహస్యాన్ని పంచుకున్నారు. తన తల్లిదండ్రుల పెంపకం, వారి నిరంతర విమర్శలే తనను ఈ స్థాయికి చేర్చాయని ఆయన అన్నారు. “ఆసియా తల్లిదండ్రుల వద్ద పెరిగిన వారికి జీవితాంతం థెరపీ అవసరం” అని చమత్కరించినప్పటికీ, ఆ కఠినమైన పెంపకమే తనలో అపారమైన స్థైర్యాన్ని, వినయాన్ని నింపిందని స్పష్టం చేశారు. ఒక బహిరంగ కార్యక్రమంలో మాట్లాడుతూ, హువాంగ్ తన చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకున్నారు. తన తల్లిదండ్రులు నిరంతరం తనను మెరుగుపరచడానికే ప్రయత్నించేవారని, ఏ విషయంలోనూ పూర్తి సంతృప్తి వ్యక్తం చేసేవారు కాదని తెలిపారు. చదువులో మార్కులు, చేసిన ప్రయత్నం, సాధించిన విజయం ఏదైనా సరే.. “ఇంకా మెరుగ్గా చేయొచ్చు” అనే ఫీడ్‌బ్యాక్ ఎప్పుడూ ఉండేదని చెప్పారు. ఆశ్చర్యకరంగా, 63 ఏళ్ల వయసులో, ప్రపంచంలోని అత్యంత విలువైన కంపెనీలలో ఒకదానికి నాయకత్వం వహిస్తున్నప్పటికీ, తన తండ్రి ఇప్పటికీ ఒక మీటింగ్ తర్వాత సలహాలు ఇస్తూనే ఉంటారని నవ్వుతూ చెప్పారు. “వారికి మేం మరింత ఉన్నత స్థాయికి ఎలా వెళ్ళాలనే దానిపై ఎప్పుడూ కొన్ని ఆలోచనలు ఉంటాయి” అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఈ నిరంతర విమర్శలను తాను ఎప్పుడూ అవమానంగా భావించలేదని హువాంగ్ స్పష్టం చేశారు. తన పూర్తి సామర్థ్యాన్ని తాను గ్రహించాలన్నదే వారి తపన అని, అది వారి ప్రేమను, శ్రద్ధను చూపించే విధానమని వివరించారు. “నువ్వు



చేయగలిగినంత ఉత్తమంగా చేశావు, కానీ అది సరిపోదు” అని వారు అనడంలోనే వారి ప్రేమ దాగి ఉందని ఆయన అన్నారు. ఈ తరహా పెంపకం కారణంగానే తాను విమర్శలను సులభంగా స్వీకరించగలనని, కొత్త విషయాలు నేర్చుకోవడంలో వెనుకాడనని, ఎప్పుడూ వినయంగా ఉండగలనని హువాంగ్ తెలిపారు. ఇదే విధానాన్ని ఆయన తన సంస్థ ఎన్విడియాలో కూడా పాటిస్తారు. తాను నిజంగా శ్రద్ధ వహించే ఉద్యోగులకు తేలికపాటి ప్రశంసలకు బదులుగా, లోతైన, నిర్మాణాత్మకమైన ఫీడ్‌బ్యాక్ ఇస్తానని వెల్లడించారు. ఈ విధానం అక్కడి మేనేజర్లకు, ఎగ్జిక్యూటివ్‌లకు సుపరిచితమే. ఈ కథనం ఆధారంగా, నేటితరం తల్లిదండ్రులకు కొన్ని ముఖ్యమైన సూచనలు కూడా అందాయి. పిల్లలపై అధిక అంచనాలు ఉండటం మంచిదే అయినా, అది మానసిక మద్దతు, ఆప్యాయతతో కూడి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం విమర్శిస్తూ ఉంటే పిల్లలు తమను తాము తక్కువగా అంచనా వేసుకునే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పిల్లల కృషిని గుర్తించడం, వారి వ్యక్తిత్వాన్ని కాకుండా వారి చర్యలను విమర్శించడం, దిద్దుబాటు వెనుక ఉన్న కారణాన్ని వివరించడం, ప్రతికూల ఫీడ్‌బ్యాక్‌ను ప్రోత్సాహంతో సమతుల్యం చేయడం వంటివి తల్లిదండ్రులు అలవర్చుకోవాలని వారు సలహా ఇస్తున్నారు. మొత్తంమీద, జెన్సన్ హువాంగ్ అనుభవం.. కఠినమైన అంచనాలు, నిరంతర ప్రోత్సాహం ఒక వ్యక్తిలో ఎలాంటి గొప్ప మార్పు తీసుకురాగలవో తెలియజేస్తుంది. అయితే, ఆ విమర్శలు ప్రేమ, మద్దతుతో కూడి ఉన్నప్పుడే సానుకూల ఫలితాలు వస్తాయన్నది కూడా అంతే ముఖ్యం.

## గాలి నుంచి నీరు.. 13 ఏళ్ల బాలుడి అద్భుత సృష్టి!




వయసు చిన్నదైనా ఆలోచన చాలా పెద్దది. ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో ఒకటైన నీటి కొరతకు తనదైన పరిష్కారం కనుగొన్నాడు 13 ఏళ్ల విద్యార్థి. గాలిలోని తేమను గ్రహించి, దానిని నీరుగా మార్చే ఒక వినూత్న పరికరాన్ని రూపొందించి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రం, బీవర్టన్‌లో ఉన్న విట్‌ఫోర్డ్ మిడిల్ స్కూల్‌లో చదువుతున్న రాయ్ కిమ్ అనే విద్యార్థి ఈ అద్భుత ఆవిష్కరణ చేశాడు. ముఖ్యంగా కరవుతో బాధపడుతున్న వ్యవసాయ క్షేత్రాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ పరికరాన్ని తయారుచేశాడు. రాయ్ కిమ్ తన ఆవిష్కరణ కోసం ‘పెల్టియర్ మాడ్యూల్’ అనే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాడు. ఈ మాడ్యూల్‌కు విద్యుత్తును అందించినప్పుడు, దాని ఒకవైపు వేడిగా, మరోవైపు చాలా చల్లగా మారుతుంది. పరికరంలోని ఫ్యాన్ ద్వారా గాలిని లోపలికి పంపి, ముందుగా వేడి వైపునకు పంపడం ద్వారా గాలి ఉష్ణోగ్రతను మరింత పెంచుతారు. ఆ తర్వాత వేడెక్కిన గాలిని వెంటనే చల్లటి వైపునకు పంపినప్పుడు, గాలిలోని నీటి ఆవిరి చల్లబడి నీటి బిందువులుగా ఘనీభవిస్తుంది. ఇలా ఏర్పడిన నీటి చుక్కలను ఒక గరాటు ద్వారా సేకరించి, వాల్వ్ సహాయంతో మొక్కలకు అందిస్తారు. ఈ పరికరానికి అమర్చిన సెన్సార్లు దీని సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నాయి. నేలలోని తేమను గుర్తించే సెన్సార్, అవసరమైన మేరకే నీటిని విడుదల చేస్తుంది. దీనివల్ల నీరు వృథా కాదు. అలాగే, ఉష్ణోగ్రత, తేమ సెన్సార్లు వాతావరణానికి అనుగుణంగా గాలి ప్రవాహాన్ని నియంత్రిస్తూ పరికరం సమర్థవంతంగా పనిచేసేలా చూస్తాయి. జరిపిన పరీక్షల్లో ఈ పరికరం రెండు గంటల్లో సుమారు 10 మిల్లీలీటర్ల నీటిని ఉత్పత్తి చేసింది. ఒక కిలోవాట్-గంట విద్యుత్‌కు 135.8 గ్రాముల నీటిని ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని ఇది కలిగి ఉంది. సహజ ప్రక్రియలకు ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని జోడించి సుస్థిర వ్యవసాయానికి ఒక పరిష్కారాన్ని అందించడమే తన లక్ష్యమని రాయ్ కిమ్ వివరించాడు.

### జాతీయ స్థాయిలో గుర్తింపు

వ్యవసాయ రంగంలో నీటి కొరతపై అవగాహన కల్పించేందుకు రాయ్ కిమ్ తన ప్రాజెక్టును అమెరికాలో 5 నుంచి 8వ తరగతి విద్యార్థుల కోసం నిర్వహించే ప్రతిష్ఠాత్మక ‘3వీ యంగ్ సైంటిస్ట్ ఛాలెంజ్’ పోటీకి పంపాడు. దేశవ్యాప్తంగా వచ్చిన ఎంట్రీల నుంచి టాప్ 10 ఫైనలిస్టులలో ఒకరిగా నిలిచాడు. ఈ పోటీ ఫైనల్స్ అక్టోబర్ 12, 13 తేదీల్లో జరగనుండగా, అప్పుడే విజేతను ప్రకటిస్తారు. భవిష్యత్తులో పర్యావరణ ఇంజనీర్ కావాలని, ప్రపంచ సమస్యలకు మరిన్ని పరిష్కారాలు కనుగొనాలని ఆశిస్తున్నట్లు రాయ్ కిమ్ తెలిపాడు. అమెరికాలో మంచినీటి వినియోగంలో ఎక్కువ భాగం వ్యవసాయానికే వెళ్తున్న నేపథ్యంలో, రాయ్ కిమ్ ఆవిష్కరణ సహజ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

## గుహలో కాలాన్ని మరిచిపోయిన వాలంటీర్లు!

ఫ్రాన్స్‌లో నిర్వహించిన ఒక అసాధారణ ప్రయోగంలో పాల్గొన్న వాలంటీర్లు కాలాన్నే మరిచిపోయారు. బయటి ప్రపంచంతో ఎలాంటి సంబంధం లేకుండా, సూర్యరశ్మి, గడియారాలు, ఫోన్లు లేకుండా ఒక గుహలో 40 రోజులు గడిపారు. అయితే, ప్రయోగం ముగిసి బయటకు వచ్చాక, తాము కేవలం 30 రోజులు మాత్రమే లోపల ఉన్నామని భావించి ఆశ్చర్యపోయారు. మానవ మెదడు సమయాన్ని ఎలా గ్రహిస్తుంది, సుదీర్ఘకాలం ఏకాంతంలో ఉన్నప్పుడు శారీరకంగా, మానసికంగా ఎలాంటి మార్పులు వస్తాయో తెలుసుకునేందుకు ఈ ప్రయోగాన్ని చేపట్టారు. ఫ్రెంచ్-స్విస్ పరిశోధకుడు క్రిస్టియన్ క్లాట్ నేతృత్వంలోని ‘హ్యూమన్ అడాప్టేషన్ ఇన్‌స్టిట్యూట్’ ఈ “డీప్ టైమ్” అనే ప్రయోగాన్ని ఫ్రాన్స్‌లోని లోంబ్రైవ్స్ గుహలో నిర్వహించింది. 2021 మార్చి 14 నుంచి ఏప్రిల్ 24 వరకు సాగిన ఈ పరిశోధనలో 27 నుంచి 50 ఏళ్ల వయసున్న ఏడుగురు మహిళలు, ఎనిమిది మంది పురుషులు పాల్గొన్నారు. గుహలోపల ఉష్ణోగ్రత స్థిరంగా 10 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 100 శాతంగా ఉన్నాయి. నిద్రించడానికి, కలిసి జీవించడానికి, శాస్త్రీయ పరిశోధనలు చేయడానికి మూడు వేర్వేరు ప్రాంతాలను ఏర్పాటు చేశారు. వారి శరీరాల్లో మార్పులను గమనించేందుకు బయోమెట్రిక్ సెన్సార్లను అమర్చారు. బయటి ప్రపంచంతో సంబంధం తెగిపోవడంతో వారి శరీరంలోని జీవ గడియారం (ఱఅతీఘఱఅఖఱఅ తీష్ట్రవ్‌ష్ట్రఎ) నెమ్మదించింది. దీంతో వారి రోజులు 24 గంటల కంటే ఎక్కువగా సాగాయి. ఫలితంగా, 40 రోజులు గడిచినా కేవలం 30 రోజులే అయినట్లు వారు



భావించారు. ఒక గణిత ఉపాధ్యాయుడు అయితే కేవలం 23 రోజులే గడిచిందని చెప్పడం గమనార్హం. అతని దినచర్య ఏకంగా 40 గంటల వరకు సాగినట్లు గుర్తించారు. 1960లలో మిషెల్ సిఫ్రే చేసిన ఇలాంటి ప్రయోగాల ఫలితాలనే ఈ పరిశోధన కూడా ధ్రువీకరించింది. ఈ ప్రయోగం ద్వారా సేకరించిన సమాచారం గనులు, సబ్‌మెరైన్లలో పనిచేసే సిబ్బందికి, సుదూర అంతరిక్ష యాత్రలు (ఉదాహరణకు అంగారక గ్రహ యాత్ర) చేసే వ్యోమగాములకు ఎంతగానో ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సహజ కాంతి, సమయ సూచికలు లేని వాతావరణంలో మానవ బృందాలు ఎలా కలిసి పనిచేస్తాయో అర్థం చేసుకోవడానికి ఇది తోడ్పడుతుంది. ఈ అనుభవంపై స్పందించిన పలువురు వాలంటీర్లు, సమయం స్తంభించిపోయినట్లు అనిపించిందని, ఇది ఒక ప్రత్యేకమైన అనుభూతినిచ్చిందని తెలిపారు. బృంద సభ్యుల మధ్య సామాజిక బంధం, కలిసి పనిచేయాలనే తపన వారిని ఒకే తాటిపై నడిపిందని క్రిస్టియన్ క్లాట్ పేర్కొన్నారు.




# తీవ్ర హెచ్చుతగ్గుల్లో సూచీలు

ముంబై, ఆగస్టు 5 : దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనయ్యాయి. వరుసగా నాలుగోసారి రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడం మార్కెట్ వర్గాలను రుచించలేదు. ఒక దశలో 800 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 152 పాయింట్లు అందుకొని 78,581 వద్ద ముగిసింది. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 9.75 పాయింట్లు అందుకొని 24,624.65 వద్ద నిలిచింది. బ్లూచిప్ సంస్థల షేర్లతోపాటు బ్యాంకింగ్, వాహన, క్యాపిటల్ గూడ్స్ షేర్లు లాభాల్లోకి రావడం కలిసొచ్చింది. అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్టీపీసీ, ఎస్బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, కొటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగియగా..టీసీఎస్, హెచ్‌సీఎల్, రిలయన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు నష్టపోయాయి.

# బొండాడ లాభం 53 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 5 : రాష్ట్రానికి చెందిన ఇంజినీరింగ్ సేవల సంస్థ బొండాడ ఇంజినీరింగ్ ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.53 కోట్ల లాభాన్ని ఆర్జించింది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.38.2 కోట్ల లాభంతో పోలిస్తే 38 శాతం ఎగబాకింది. సమీక్షాకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 24 శాతం ఎగబాకి రూ.691.6 కోట్లకు చేరుకున్నది. కంపెనీ తాజాగా ఏరోస్పేస్, రక్షణ రంగ వ్యాపారంలోకి అడుగుపెట్టింది. ఇందుకోసం హైదరాబాద్‌కు చెందిన కేసీఎస్ ఇంజినీరింగ్ సొల్యూషన్స్‌లో 75 శాతం వాటాను కొనుగోలు చేసింది.


# కేంద్రం కొత్త బిల్లు.. ఆ కంపెనీలకు 15 ఏళ్లు నో ట్యాక్స్!

దేశాన్ని ప్రపంచ ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన పన్నులు, ఇతర చట్టాల (సవరణ) బిల్లు-2026లో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి సంబంధించిన ఆదాయపు పన్ను రాయితీలను గణనీయంగా విస్తరించాలని ప్రతిపాదించింది. పెట్టుబడులు పెంచడం, తయారీ రంగానికి ఊతమివ్వడం, విదేశీ పెట్టుబడిదారులకు పన్ను పరమైన స్పష్టత కల్పించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటి వరకు పరిమిత కాలానికే ఉద్దేశించిన పన్ను మినహాయింపులను ఇప్పుడు 15 ఏళ్లకు పొడిగించాలని ప్రతిపాదించారు. ఈ మార్పు ప్రకారం, విదేశీ కంపెనీలు భారతీయ కాంట్రాక్ట్ తయారీ సంస్థలకు యంత్రాలు, క్యాపిటల్ ఎక్విప్‌మెంట్, టూలింగ్ వంటి పరికరాలను అందించి, భారత్‌లో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ చేపట్టే సందర్భంలో వచ్చే ఆదాయంపై 2040-41 ఆర్థిక సంవత్సరం వరకు పన్ను మినహాయింపు లభించనుంది. పరిశ్రమ ప్రతినిధులతో జరిగిన సంప్రదింపుల తర్వాత మొదట ప్రతిపాదించిన ఐదేళ్ల గడువును మరో పదేళ్లు పెంచినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ రాయితీల పరిధిలో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్లు, పర్సనల్ కంప్యూటర్లు, సర్వర్లు, వాటి కీలక భాగాలు వంటి ఉత్పత్తులు ఉన్నాయి. దీంతో దేశీయ తయారీ సంస్థలపై మూలధన భారం తగ్గడంతో పాటు, అంతర్జాతీయ బ్రాండ్లు భారత్‌లో మరింత విస్తృతంగా తయారీ కార్యకలాపాలు చేపట్టే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి ఇది మరింత బలాన్ని చేకూర్చనుంది. అంతేకాదు, భారతీయ తయారీ యూనిట్లకు అవసరమైన విడిభాగాలను విదేశీ సంస్థలు సమీప గిడ్డంగుల్లో నిల్వ ఉంచినప్పుడు ప్రస్తుతం వర్తించే 2 శాతం పన్నును కూడా 15 ఏళ్లపాటు మినహాయించాలని బిల్లులో ప్రతిపాదించారు. దీని వల్ల సరఫరా వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారడంతో పాటు, ఉత్పత్తి ప్రక్రియలో అంతరాయాలు తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, గ్లోబల్ ఫండ్ మేనేజర్లను భారత్‌కు ఆకర్షించేందుకు కూడా ప్రభుత్వం కీలక మార్పులు ప్రతిపాదించింది. ప్రస్తుతం విదేశీ ఫండ్ మేనేజర్లు భారత్‌లో కార్యకలాపాలు నిర్వహించాలంటే అనేక నిబంధనలు పాటించాల్సి ఉండగా, వాటిలో ఎక్కువ భాగాన్ని తొలగించాలని బిల్లు సూచిస్తోంది. అయితే భారతీయ పెట్టుబడిదారులు ఈ నిబంధనలను దుర్వినియోగం చేయకుండా తగిన రక్షణ చర్యలు మాత్రం కొనసాగనున్నాయి. ఈ చర్యలతో భారత్‌ను అంతర్జాతీయ పెట్టుబడులకు మరింత అనుకూల గమ్యస్థానంగా మార్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.



# యూపీఐ పేమెంట్స్‌పై చార్జీలు?

ఇన్నాళ్లూ డిజిటల్ పేమెంట్స్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ వచ్చిన మోదీ సర్కార్.. ఇక ఈ జోరుకు బ్రేకులు వేసే దిశగా వెళ్లనున్నది. అవును.. మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పేమెంట్ అండ్ సెటిల్మెంట్ సిస్టమ్స్ చట్టం 2007కు సవరణలను ప్రతిపాదించింది. దీనివల్ల యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగే లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్లు (ఎండీఆర్) మళ్లీ రాబోతున్నాయి. అయితే యూపీఐ సేవల విస్తరణ తదుపరి వృద్ధికి నిధుల కోసమే ఈ సవరణలు అని తెలుస్తుండగా.. సదరు చట్ట సవరణతో యూపీఐ చెల్లింపులపై చార్జీలుపడే వీలుందన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయిప్పుడు.




**ఇదీ సంగతి..**

పేమెంట్ అండ్ సెటిల్మెంట్ సిస్టమ్స్ యాక్ట్ 2007కు సవరణలు చేస్తే యూపీఐపై ఎండీఆర్‌ను విధించడానికి కేంద్ర ప్రభుత్వానికి అవకాశం లభిస్తుంది. అలాగే ప్రస్తుతం సెక్షన్ 10ఏ కింద జీరో ఎండీఆర్ నిబంధనను రద్దు చేయవచ్చు. నిజానికి ఈ నిబంధన వల్లే ఆన్‌లైన్ పేమెంట్స్‌పై బ్యాంకులు, పేమెంట్స్ సిస్టమ్ ప్రొవైడర్స్ (పీఎస్‌పీలు)చార్జీలు వసూలు చేయడం లేదు. చట్ట సవరణతో చార్జీలు అమల్లోకి వస్తాయి. రూ.2వేలకు మించిన లావాదేవీలపై 0.3 శాతం నుంచి 0.5 శాతం వరకు ఎండీఆర్‌ను విధించే యోచనలో ఉన్నట్టు ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. అయితే వార్షిక టర్నోవర్ రూ.1.5 కోట్లు దాటిన వ్యాపారులపైనే ఈ భారం ఉండవచ్చని తెలుస్తున్నది. దీనివల్ల అంతిమంగా కొనుగోలుదారులపైనే భారం పడుతుందన్న ఆందోళనలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి.

**ఉదాహరణకు..**

ఓ కస్టమర్ రూ.1,000 విలువైన వస్తువును ఓ షాపులో కొన్నారు. క్రెడిట్, డెబిట్ కార్డు లేదా యూపీఐ యాప్ ద్వారా చెల్లించారు. జీరో ఎండీఆర్ పాలసీ వల్ల ఇప్పుడు ఈ పేమెంట్‌ను కస్టమర్‌కు చెందిన బ్యాంక్, వ్యాపారికి చెందిన బ్యాంక్‌లతోపాటు పీఎస్‌పీలు ఉచితంగానే ప్రాసెస్ చేస్తున్నాయి. దీనివల్ల సదరు వస్తువును అమ్మిన వ్యాపారి ఖాతాలో రూ.1,000 జమ అవుతున్నది. అయితే జీరో ఎండీఆర్ పాలసీ రైద్దైతే కస్టమర్ పేమెంట్‌ను ప్రాసెస్ చేసినందుకు బ్యాంకులు, పీఎస్‌పీలు వ్యాపారుల దగ్గర చార్జీలను వసూలు చేస్తాయి. దీనివల్ల వ్యాపారి ఖాతాలో రూ.1,000 కంటే తక్కువ జమవుతుంది. అయితే నష్టపోతున్న సదరు చార్జీ మొత్తాన్ని వ్యాపారులు కస్టమర్ దగ్గరే వసూలు చేసే వీలుందని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. ప్రభుత్వ పెద్దలు తాము కస్టమర్ల పేమెంట్స్‌పై చార్జీలు వేయట్లేదంటున్నా.. ప్రాసెసింగ్ లేదా అదనపు చార్జీల పేరిటనో, వస్తువు ధరను పెంచో వ్యాపారులు కొనుగోలుదారుల వద్దే ఆ చార్జీలను రాబడుతారని హెచ్చరిస్తుండటం గమనార్హం. పైగా దీనివల్ల నెమ్మదిగా యూపీఐ లావాదేవీలు తగ్గుముఖం పట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదని వారంటున్నారు. పాత పెద్ద నోట్ల రద్దుతో దేశంలో ఆన్‌లైన్ చెల్లింపులను కేంద్రం ప్రోత్సహించిన సంగతి విదితమే.

**పార్లమెంటరీ కమిటీ సూచన?**

ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ ఏడాది మార్చిలో ఇచ్చిన నివేదిక ప్రకారం దేశంలో ఇప్పుడు జరుగుతున్న అన్ని డిజిటల్ లావాదేవీలలో దాదాపు 88 శాతం యూపీఐ ఆధారంగా చేస్తున్నవే. బ్యాంకులు, పీఎస్‌పీలు ప్రతి నెలా సుమారు రూ.30 లక్షల కోట్ల విలువైన 23 బిలియన్లకుపైగా లావాదేవీలను ప్రాసెస్ చేస్తున్నాయని కూడా కమిటీ తెలిపింది. ఈ క్రమంలోనే జీరో ఎండీఆర్ పాలసీ.. యూపీఐ ఎకోసిస్టమ్‌ను దీర్ఘకాలంలో ఆర్థికంగా అస్థిరపర్చగలదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అందుకే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజా చర్యలకు దిగినట్టు చెప్తున్నారు.జబతీతీవఅషఅవం ఄ ఖీశీతీవఅస్త్రఅ జుఇఎష్ణుఅస్త్రవ

**ఇండస్ట్రీ మాటేంది?**

గత ఏడాది మార్చిలో పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) కేంద్రానికి ఓ లేఖను సమర్పించింది. యూపీఐ, రూపే డెబిట్ కార్డ్ లావాదేవీలపై జీరో ఎండీఆర్ పాలసీని పునఃసమీక్షించాలని అందులో ఈ మెజారిటీ బ్యాంకింగేతర చెల్లింపుదారుల సంఘం కోరింది. జీరో ఎండీఆర్ విధానంతో ఆర్థిక అస్థిరత ఏర్పడే ప్రమాదముందన్నది. అందుకే రూపే డెబిట్ కార్డులపై వ్యాపారులందరికీ ఎండీఆర్‌ను ప్రతిపాదించింది. అలాగే బడా వ్యాపారులకు యూపీఐపై 0.3 శాతం ఎండీఆర్ చార్జీలు వేయాలన్నది.ఎండీఆర్ అంటే ఏమిటి? కొనుగోలుదారులు నిత్యం రకరకాల దుకాణాలు, షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లు, మరెన్నో చోట్ల చేసే ఆన్‌లైన్ (యూపీఐ) చెల్లింపుల (గూగుల్ పే, ఫోన్‌పే మొదలైనవాటి ద్వారా)ను బ్యాంకులు, పీఎస్‌పీలు ప్రాసెస్ చేస్తాయి. ఇందుకుగాను ఆయా వ్యాపారులు వాటికి చెల్లించే ఫీజునే మర్చంట్ డిస్కౌంట్ రేట్ లేదా ఎండీఆర్ అంటారు. 2020 నుంచి యూపీఐ, రూపే డెబిట్ కార్డు లావాదేవీలకు ఎండీఆర్ 0%గానే ఉంటున్నది. డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించడానికి అటు కస్టమర్లకు, ఇటు వ్యాపారులకు జీరో ఎండీఆర్ పాలసీని కేంద్రం వర్తింపజేస్తున్నది.


# వ్యూహాత్మక ఖనిజంగా బంగారం!

ముంబై, ఆగస్టు 4: బంగారాన్ని వ్యూహాత్మక ఖనిజంగా వర్గీకరించాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) సూచించింది. దేశీయంగా మైనింగ్‌ను ఉత్సాహపర్చేందుకు, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకొనేందుకు ఇది అవసరమని పేర్కొన్నది. గోల్డ్ మైనింగ్ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతులతో సంబంధం లేకుండా కేంద్రం నుంచే అనుమతులు వచ్చేలా.. అదికూడా సింగిల్ విండో క్లియరెన్స్ మెకానిజమ్‌ను తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని గనుల మంత్రిత్వ శాఖతో జరిగిన చర్చల్లో డబ్ల్యూజీసీ ఇండియా ప్రాంతీయ సీఈవో సచిన్ జైన్ అన్నారు. ఈ మేరకు ఓ ఇంటర్వ్యూలో ఆయన పీటీఐకి తెలియజేశారు. కాగా, ఏడాదిపాటు బంగారాన్ని దేశ ప్రజలు కొనవద్దని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆమధ్య పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఇది.. దేశంలోకి వచ్చే పసిడి దిగుమతుల్ని తగ్గించడానికేనని ప్రభుత్వం చెప్పుకొచ్చిన సంగతీ విదితమే. దేశీయ దిగుమతుల్లో ఇంధనం తర్వాత వాటా పుత్తడిదే మరి. గల్ఫ్ వార్ కారణంగా పెరుగుతున్న ముడి చమురు ధరల దృష్ట్యా.. ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి డాలర్లను అధికంగా చెల్లించాల్సి వస్తుండటంతో.. తగ్గే బంగారం దిగుమతులతో ఆ మిగిలిన డాలర్లను అందుకు ఉపయోగించుకోవచ్చన్నది సర్కార్ యోచన. అయితే దేశంలోనే బంగారం తవ్వకాలు పెరిగితే.. ఈ సమస్య ఉండదని డబ్ల్యూజీసీ అంటున్నది.



# యాపిల్ కీలక నిర్ణయం!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రోజురోజుకూ వేగంగా విస్తరిస్తూ.. సైబర్ సెక్యూరిటీ రంగంపైనా ప్రభావం చూపిస్తోంది. ఈ నేపథ్యంలో.. టెక్ దిగ్గజం యాపిల్ కీలక నిర్ణయం తీసుకుంది. సెక్యూరిటీ పరిశోధకులు ఒకేసారి సమర్పించగలిగే సెక్యూరిటీ రిపోర్టుల సంఖ్యపై పరిమితి విధించింది. దీనికి ప్రధాన కారణం.. చాట్‌జీపీటీ వంటి ఏఐ టూల్స్ సహాయంతో పెద్ద ఎత్తున భద్రతా లోపాలకు సంబంధించిన సమస్యలు రావడమే. దీంతో ప్రతి రిపోర్టును పరిశీలించడం యాపిల్ బృందానికి భారంగా మారిందని కంపెనీ తెలిపింది. యాపిల్‌లో ప్రతి సెక్యూరిటీ రిపోర్టును నిపుణులు విడిగా పరిశీలించి, అందులో నిజంగా లోపం ఉందా?, లేదా?.. అనే విషయాన్ని నిర్ధారిస్తారు. కానీ.. ఇటీవల ఏఐ సృష్టించిన అనేక రిపోర్టుల్లో వాస్తవానికి సంబంధం లేని లేదా.. కేవలం ఊహాజనిత సమస్యలు ఎక్కువగా ఉండటంతో, వాటిని పరిశీలించడానికే ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తోంది. ఈ కారణంగా నిజమైన భద్రతా లోపాలను గుర్తించి వాటికి పరిష్కారం చూపే ప్రక్రియ ఆలస్యం కావచ్చని కంపెనీ భావించింది. అందుకే ఒకేసారి ఓపెన్‌గా ఉంచే సెక్యూరిటీ రిపోర్టుల సంఖ్యపై పరిమితి విధించడం జరిగింది. అయితే.. ఏఐ వల్ల ప్రతికూలతలే కాకుండా ప్రయోజనాలు కూడా ఉన్నాయని యాపిల్ చెబుతోంది. కొన్ని ఏఐ సిస్టమ్‌లు మ్యాక్‌ఓఎస్‌లో చాలా తక్కువ సమయంలోనే 50కు పైగా సంభావ్య భద్రతా లోపాలను గుర్తించాయి. వాటిలో కొన్ని చాలా కీలకమైనవిగా ఉండటంతో యాపిల్ వెంటనే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ల ద్వారా వాటిని




పరిష్కరించింది. ప్రస్తుతం యాపిల్ తన బగ్ బౌంటీ ప్రోగ్రామ్ ద్వారా నిజమైన సెక్యూరిటీ లోపాలను గుర్తించిన పరిశోధకులకు లోపం తీవ్రతను బట్టి గరిష్ఠంగా 5 మిలియన్ డాలర్ల వరకు బహుమతిని కూడా అందిస్తోంది. అయితే కొత్త పరిమితుల వల్ల భవిష్యత్తులో కొన్ని కీలకమైన నిజమైన రిపోర్టులు కూడా ఆలస్యంగా పరిశీలించే అవకాశం ఉందని సైబర్ సెక్యూరిటీ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ప్రస్తుతం తమిళనాడు రాజకీయ పరిణామాలకు కథానాయిక త్రిష కేంద్రబిందువుగా మారింది. మరోవైపు ఆమె రాజకీయాల్లోకి రావాలంటూ అభిమానుల నుంచి ఒత్తిడి పెరుగుతున్నది. అయితే ఈ విషయాలేవీ పట్టించుకోకుండా కొత్త సినిమా సన్నాహాల్లో త్రిష బిజీగా ఉంది. తాజా సమాచారం ప్రకారం కార్తి జోడీగా ఈ భామ ఓ సినిమా చేయబోతున్నట్లు తెలిసింది. మోహన్‌రాజా దర్శకత్వంలో కార్తి కొత్త చిత్రాన్ని ఇటీవలే ప్రకటించారు. త్వరలో షూటింగ్ ప్రారంభంకానుంది. ఈ సినిమా కోసం కథానాయిక అన్వేషణలో ఉన్న చిత్రబృందం నయనతార, త్రిష పేర్లను ప్రముఖంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. నయనతార ప్రస్తు తం వరుస సినిమాలతో బిజీగా ఉండటంతో ఆమె డేట్స్ సర్దుబాటు అయ్యే అవకాశాలు లేవని అంటున్నారు. దాంతో ఈ సినిమాలో త్రిష ను నాయికగా ఖరారు చేయబోతున్నారని చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్న ది. 'పొన్నియన్ సెల్వ న్' చిత్రంలో కార్తి-త్రిష జోడీగా నటించారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి కాంబినేషన్ అభిమానుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది.

## కార్తి జోడీగా?



# ఓ యోధుడి గాథ 'కరికాల'

సందీప్‌కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి 'కరికాల' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'శంబాల' ఫేమ్ యుగంధర్ ముని దర్శకత్వంలో షైనింగ్ పిక్చర్స్ పతాకంపై మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. బుధవారం టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో సందీప్‌కిషన్ ఖడ్గాన్ని చేతబూని గుర్రంపై స్వారీ చేస్తూ.. సింహాన్ని వేటాడుతూ ఓ యోధుడి అవతారంలో కనిపిస్తున్నారు. సోషియో ఫాంటసీ అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు అర్థమవుతున్నది. ఈ సినిమాను రెండు భాగాలుగా తెరకెక్కించబోతున్నామని, తొలి భాగాన్ని వచ్చే ఏడాది జూలై 2న, రెండో భాగాన్ని అక్టోబర్ 28న విడుదల చేయబోతున్నామని మేకర్స్ తెలిపారు. అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్, అద్భుతమైన కథ, కథనాలతో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని దర్శకుడు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.



# రాజకీయాలపై శోభిత ధూళిపాళ సంచలన వ్యాఖ్యలు

ప్రముఖ నటి, అక్కినేని నాగచైతన్య భార్య శోభితా ధూళిపాళ తన రాజకీయ భావజాలంపై చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియా వ్యాప్తంగా విపరీతమైన చర్చకు దారితీస్తున్నాయి. "నాకు వామపక్ష భావజాలం చాలా ఎక్కువ. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కమ్యూనిజమే కచ్చితంగా విజయం సాధిస్తుంది" అని ఆమె చెప్పిన మాటలు పెను దుమారమే రేపాయి. గ్లామర్ ఇండస్ట్రీలో ఉంటూ, తమ కెరీర్ దెబ్బతింటుందనే భయంతో ఏ హీరోయిన్ కూడా పొలిటికల్ ఐడియాలజీని బయటకు చెప్పేందుకు ఇష్టపడరు. అలాంటిది శోభితా ధూళిపాళ ఎలాంటి దాపరికం లేకుండా, అత్యంత ధైర్యంగా తన మనసులోని అభిప్రాయాలను బయటపెట్టడంపై కొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు. వ్యక్తిగత భావ ప్రకటన స్వేచ్ఛకు గౌరవం ఇస్తూ ఆమె నిజాయతీని కొనియాడుతున్నారు. అయితే, మరికొందరు నెటిజన్లు మాత్రం ఆమె వ్యాఖ్యలపై తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. చిత్ర పరిశ్రమలో నటిగా ఉంటూ, అత్యంత విలాసవంతమైన లైఫ్‌స్టైల్‌ను గడుపుతున్న శోభిత... కమ్యూనిజం గురించి మాట్లాడటం సరికాదని కామెంట్స్ చేస్తున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఆమె చెప్తున్న సిద్ధాంతాలు ఆచరణాత్మకంగా ఎంతవరకు సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే, నాగచైతన్యతో వివాహం తర్వాత కొంత విరామం తీసుకున్న శోభిత..జ 'చీకటిలో', 'క్రాస్ రోడ్స్' వంటి ప్రాజెక్టులతో అలరించారు. ప్రస్తుతం ఇవి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం 'సిల్ బట్టా', 'వెట్టువం' వంటి వినూత్న చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.



# అక్టోబర్‌లో సెట్స్‌పైకి 'బ్లడీ రోమియో'?

గత ఏడాది పవన్‌కల్యాణ్ 'ఓజీ' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్నారు దర్శకుడు సుజిత్. ప్రస్తుతం ఆయన లైనప్‌లో 'ఓజీ' సీక్వెల్‌తో పాటు నానితో 'బ్లడీ రోమియో' సినిమా కూడా ఉంది. 'ఓజీ-2' సెప్టెంబర్‌లో ప్రారంభంకానుందనే వార్తలు కూడా వచ్చాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం 'ఓజీ-2' సినిమాకు బ్రేక్‌నిచ్చి 'బ్లడీ రోమియో'ను పట్టాలెక్కించేందుకు దర్శకుడు సుజిత్ సిద్ధమవుతున్నారని తెలిసింది. అక్టోబర్‌లో 'బ్లడీ రోమియో' సెట్స్‌పైకి వెళ్తుందని ఫిల్మ్‌నగర్ టాక్. అయితే ఈ విషయంలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం నాని 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా సెప్టెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. దీని తర్వాత 'బ్లడీ రోమియో'తో పాటు 'బ్లాస్ట్' ఫేమ్ సుభాష్ కె రాజ్ డైరెక్షన్‌లో నాని ఓ చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది.




# నాన్‌స్టాప్ షెడ్యూల్‌లో' ఫౌజీ'

అగ్ర కథానాయకుడు ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్' 'ఫౌజీ' చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఇటలీ విహారయాత్ర నుంచి తిరిగొచ్చిన ఆయన హైదరాబాద్‌లో జరుగుతున్న 'ఫౌజీ' షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. డిసెంబర్ 3న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో త్వరితగతిన ఈ సినిమా షూట్‌ను పూర్తి చేయాలనే ఆలోచనలో ప్రభాస్ ఉన్నారట. అందుకోసం ఆగస్ట్ నెల మొత్తాన్ని ఈ సినిమాకే కేటాయించారని తెలిసింది. తాజా షెడ్యూల్ నాన్‌స్టాప్‌గా జరుగుతుందని, ప్రభాస్‌పై కొన్ని యాక్షన్ ఘట్టాలతో పాటు కీలక సన్నివేశాలను తెరకెక్కించబోతున్నారని తెలిసింది. 1940 దశకం నాటి స్వాతంత్ర్య సంగ్రామం, రెండో ప్రపంచయుద్ధం తాలూకు ఘటనల నేపథ్యంలో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై భారీ హైప్‌ని క్రియేట్ చేశాయి. ఇమాన్వి, మిథున్‌చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాణం: మైత్రీ మూవీ మేకర్స్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, భూషణ్ కుమార్, రచన-దర్శకత్వం: హను రాఘవపూడి.





# మాఫియా డ్రామా 'మకుటం'



హీరో విశాల్ స్వీయ దర్శకత్వంలో మూడు భిన్న పాత్రల్లో కనిపించనున్న యాక్షన్ థ్రిల్లర్ 'మకుటం' ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. సముద్రతీర ప్రాంత నేపథ్యంలో ఎత్తుకుపై ఎత్తులతో సాగే గ్యాంగ్‌స్టర్ డ్రామా ఇదని సమాచారం. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్‌గుడ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న 99వ సినిమా ఇది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. ఈ నెల 7న ట్రైలర్‌ను రిలీజ్ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో విశాల్.. గ్యాంగ్‌స్టర్, ఓల్డ్‌ఏజ్ డాన్, కార్పొరేట్ ఎంప్లాయిగా మూడు భిన్న అవతారాల్లో కనిపిస్తున్నారు. మాఫియా నేపథ్యంలో నడిచే ఈ కథలో విశాల్ పాత్ర చిత్రణ సరికొత్త పంథాలో ఉంటుందని, జీవీ ప్రకాష్‌కుమార్ మ్యూజిక్ హైలైట్‌గా నిలుస్తుందని, భారీ స్థాయిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని మేకర్స్ తెలిపారు. దుషార విజయన్, అంజలి, తంబి రామయ్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, కథ: రవి అరసు, నిర్మాత: ఆర్.బి.చౌదరి, దర్శకత్వం: విశాల్.

Printed & Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com